





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 241 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 8 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 241 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 8 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## భారత్ లక్ష్యం పాకిస్థాన్ కాదు.. ఉగ్రవాదులు మాత్రమే



- 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్న రాజ్‌నాథ్ సింగ్
- రాత్రికి రాత్రే మన సైనికులు ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేత దాడులు
- పహల్గామ్ దాడి సూత్రధారులనే లక్ష్యంగా చేసుకుని మట్టుబెట్టామని వెల్లడి

## భారత్‌కు యుద్ధం చేసే ఆలోచన లేదు.. కానీ పాక్ రెచ్చగొడితే తొక్కిపడేస్తాం

- ఉద్రిక్తతలు పెంచే ఉద్దేశం లేదని స్పష్టం చేసిన అజిత్ దోవల్
- పాకిస్థాన్ చర్యలను తిప్పికొట్టేందుకు భారత్ సిద్ధమని స్పష్టీకరణ
- అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్ సహా పలు దేశాల ప్రతినిధులతో మాట్లాడిన దోవల్




# ఆపరేషన్ సిందూర్ విజయవంతం

## ఉగ్ర స్థావరాలు ధ్వంసం

- పహల్గామ్ దాడికి బదులుగా 'ఆపరేషన్ సింధూర్'
- పీఓకే, పాక్ పంజాబ్‌లో ఉగ్ర స్థావరాలు ధ్వంసం
- జైషే, లష్కరేకు చెందిన 80 మంది ఉగ్రవాదుల మృతి
- మసూద్ అజార్ కుటుంబసభ్యులు 10 మంది హతం
- స్కాల్ప్, హామర్ క్షిపణులతో నిర్దిష్ట లక్ష్యాలపై దాడులు

వివరాలు 2లో..

### రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ

ఉగ్ర స్థావరాలపై దాడుల అనంతరం రాష్ట్రపతితో ప్రధాని సమావేశం

'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాక్, పీఓకేలో 9 ఉగ్ర స్థావరాలు ధ్వంసం

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతం




**వై రామవరం, మే 7 (పెన్ పవర్):** మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసుల సమాచారం. యార్లగడ్డ పంచాయతీ పరిధిలోని శేషరాయి సమీప దుమ్మకొండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, గ్రే హౌండ్స్ పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. మృతుల వద్ద నుంచి రెండు ఏకే-47 రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒకరు జగన్ అనే సెంట్రల్ జోనల్ కమిటీ సభ్యుడిగా గుర్తించబడ్డారు. ఇతనిపై రూ. 20 లక్షల రివార్డు ఉంది. మరో మావోయిస్టు రమేష్ డీసీఎం సభ్యుడు కాగా, ఇతనిపై రూ. 6 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి మావోయిస్టుల మృతదేహాలు ఇంకా తీసుకురాలేదని పోలీసులు తెలిపారు.

## భారత సాయుధ దళాలకు నా సెల్యూట్.. ఏపీ సీఎం చంద్రబాబు

- మన దేశం తనను తాను రక్షించుకుంటుందని సైన్యం నిరూపించిందన్నచంద్రబాబు
- మోదీ నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రశంసలు
- దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉందన్న ఏపీ సీఎం



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీం లోని ఉగ్రవాద శిబిరాలపై విజయవంతంగా దాడులు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత సాయుధ దళాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ "పహల్గామ్ ఉగ్రదా డికి

వివరాలు 2లో..

## వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే మిస్సైల్ మన దగ్గరుంది

- పాకిస్థాన్ గీత దాటిందన్న నారా లోకేశ్
- చాలా పెద్ద తప్పు చేసిందని వ్యాఖ్య
- వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే మన మిస్సైల్ మోదీ అన్న లోకేశ్

వివరాలు 2లో..



పహల్గామ్ ఉగ్ర దాడులకు భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన ఆపరేషన్ తో పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఇందులో జైషే మొహమ్మద్ కేంద్ర కార్యాలయం కూడా ఉంది. ఈ దాడిలో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పాక్ పై భారత్ చేసిన దాడిపై ఏపీ మంత్రి నారా లోకేశ్

## ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే... ఉగ్రవాద శిబిరాలపై దాడులు అనివార్యం

- దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యమైన కర్తవ్యమన్న జగన్
- ఉగ్ర చర్యలను మన రక్షణ దళాలు తిప్పికొట్టాయని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య అన్న వైసీపీ అధినేత

పెన్ పవర్ డెస్క్:దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదుల దాడుల నుంచి పౌరులను రక్షించేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా 'ఆపరేషన్ సిందూర్' వంటివి అనివార్యమని వైఎస్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు, రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి ముందు కొందరు ముఖ్య నేతలతో ఆయన 'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ...

వివరాలు 2లో..



## కర్రెగుట్టల్లో భారీ ఎన్ కౌంటర్... 22 మంది మావోలు మృతి



- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు
- ఇప్పటివరకు 22 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు నిర్ధారణ
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న కాల్పులు, మృతుల సంఖ్య పెరిగే అవకాశం

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కర్రెగు ట్టల్లో ఈ ఉదయం భద్రతా బలగాలు మరియు మావో యిస్టుల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటుచేసుకు న్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 22 మంది మావోయి స్టులు మరణించినట్లు అధికార వర్గాలు ప్రాథమికంగా వెల్లడించాయి. ప్రస్తుతం ఘటనా స్థలంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల సమీపంలోని అటవీ ప్రాంతమైన కర్రెగుట్టలను లక్ష్యంగా చేసుకుని భద్రతా బలగాలు ఈ భారీ ఆపరేషన్‌ను చేపట్టాయి.

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# భరతమాత ముద్దుబిడ్డలు

**ఇద్దరు మహిళ అధికారులే ట్రెండింగ్.. ఇద్దరు నేపథ్యమేంటంటే?**

హహేల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన తర్వాత ఆపరేషన్ సిందూరతో యుద్ధం అనివార్యమైతే భారత్ , పాకిస్తాన్ బలగాల సంగతేమిటన్న చర్చ జోరుగా సాగుతుంది. పాకిస్థాన్ బలమెంత? భారత్ బలగం ఎంత? దాదాపు తొమ్మిది ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసిన భారత్ బలగాలు, పాకిస్థాన్ బలం సంగతిపైనే సోషల్ మీడియాలో కూడా ఎక్కువ మంది సెర్చ్ చేస్తున్నారు. పాకిస్తాన్ సరిహద్దుల సమీపంలో ఎందుకు కాలుదువ్వుతుంది? దాని ధైర్యమేంటి? భారత్ తలచుకుంటే క్షణాల్లో మసైపోయే పాకిస్తాన్ లో ఇంతటి ధైర్యమెందుకు వచ్చిందన్నది కూడా చాలా మందికి అర్థం కాలేదు. అందుకే పాకిస్తాన్ బలం అనేది భారత్ తో పోల్చుకుంటే చాలా తక్కువని తెలిసినా వాటి వివరాల కోసం గూగుల్ లో వెతుకుతున్నారు.

**నాలుగో స్థానంలో...**

మిలటరీ ర్యాంకింగ్ లో భారత్ పాకిస్తాన్ కంటే ముందు వరసలో ఉంది. సైనిక శక్తికి సంబంధించి ప్రపంచంలోని 145 దేశాల జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంటే పాకిస్తాన్ పన్నెండో స్థానంలో ఉంది. భారత్ కు ఇరవై రెండు లక్షల మందికి పైగా సైనిక బలం ఉంది. దీంతో పాటు యుద్ధ ట్యాంకులు నాలుగువేలకు పైగానే ఉన్నాయి. లక్షన్నర ఆర్మర్డ్ వెహికల్స్ తో పాటు పవంద వరకూ సెల్ఫ్ ప్రొఫెల్డ్ ఆర్టిరీ, 3,975 వరకూ టోవ్డ్ ఆర్టిలరీలు ఉన్నాయని తెలుస్తోంది. అదే సమయంలో మల్టీ బారెల్ రాకెట్ ఆర్టిలరీలు 264 వరకూ ఉన్నాయి.

**పాక్ వద్ద మాత్రం...**

కానీ పాకిస్తాన్ వద్ద మాత్రం పదమూడు లక్షల మంది సైనికులున్నారు. లక్షా ఇరవై నాలుగు వేల మంది నౌకాదళ సిబ్బంది, డెబ్బయి ఎనిమిది వేల మంది వైమానిక సిబ్బంది న్నారు. పాక్ వద్ద 1,399 ఎయిర్ క్రాఫ్ట్ లుండగా,2,627 యుద్ధ ట్యాంకర్లున్నాయి. 662 సెల్ఫ్ ప్రొఫెల్డ్ ఆర్టిలరీ, 2,629 టోడ్ ఆర్టిలరీ, ఆరువందల మల్టీ బ్యారెల్ ఆర్టిలరీలున్నాయి. పాక్ నౌకాదళం వద్ద 121యుద్ధనౌకలున్నాయి. అలాగే 116 ఎయిర్ పోర్టులు, అరవై మర్చంట్ మెరైన్ షైట్లు ఉన్నాయని గ్లోబల్ పవర్ ఫైర్ వెబ్ సైట్ తెలిపింది.

**భారత్ తో పోల్చుకుంటే...**

భారత్ వాయుసేన వద్ద 3.10 లక్షల మంది సైనికులున్నారు. 2,229 విమానాలున్నాయి. వాటిలో యుద్ధ విమానాలు513 వరకూ ఉన్నాయి.ఆరు ట్యాంకర్ ఫ్లీట్ ఎయిర్ క్రాఫ్ట్ లు కలిగిన భారత్ వాయుసేనలో కూడా పాకిస్తాన్ కు మించి ఉంది. భారత్ త్రివిధళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వద్ద దాదాపు 899 హెలికాప్టర్లున్నాయి.వీటిలో దాదాపు ఎనభై అటాక్ హెలికాప్టర్లు. నౌకాదళం ప్రకారం చూసుకున్నా భారత్ బలం తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. పాకిస్తాన్ తో సరిపోల్చడానికి కూడా వీలులేదు. ఎందుకంటే భారత్ కు రెండు విమాన వాహన నౌకలతో పాటు మొత్తం 293 నౌకలున్నాయి. అర్జున్ ట్యాంక్ భారత్ కు ప్రత్యేకత. ఆధునిక ఫీల్డ్ గన్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. డ్రోన్లు కూడా ఇరు దేశాలు దగ్గర పెట్టుకున్నా ఇందులో కూడా భారత్ దేపైచేయిగానే ఉంది. పాకిస్తాన్ కంటే భారత్ వద్ద మూడింతల బలం ఎక్కువగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. భారత్ బలగంతో పోల్చుకుంటే పాక్ త్రివిధ దళాల బలం తీసికట్టుగానే చెప్పొచ్చు

# ఆపరేషన్ సిందూర్ విజయవంతం

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తో భారత్, పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక గంటలకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టింది. భారత ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా ఈ దాడిని నిర్వహించాయి. మిస్సైళ్లతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న మొత్తం తొమ్మిది స్థావరాలపై ఆర్మీ దాడులు చేపట్టింది. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు పేర్కొంది. ఉద్రిక్త పరిస్థితులకు తావులేకుండా.. పాక్ సైనిక సదుపాయాలపై ఎక్కడా దాడులు చేపట్టలేదని భారత ప్రభుత్వం పేర్కొంది. దేశ వ్యాప్తంగా బుధవారం కేంద్ర ప్రభుత్వం మాక్ డ్రిల్స్ నిర్వహించనున్న వేళ ఈ దాడులు చేయడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆపరేషన్ సిందూర్‌పై పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం 'భారత్ మాతా కీ జై' పేరుతో పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు.

పహల్గాం దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచేందుకు కట్టుబడి ఉన్నామని భారత్ వెల్లడించింది. దాడులకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని రక్షణశాఖ ప్రకటించింది. భారత ప్రభుత్వం ప్రకటన అనంతరం ఇండియన్ ఆర్మీ స్పందించింది. 'న్యాయం జరిగింది' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. మెరుపు దాడులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే దాడులు చేపట్టిన ప్రాంతాలకు సంబంధించిన వివరాలను భారత్ సైన్యం ఇంకా వెల్లడించలేదు. మరోవైపు భారత్‌లోని శ్రీనగర్, జమ్ము, అమృత్‌సర్, ధర్మశాల, లేహ్ విమానాశ్రయాలను భారత్ మూసివేసినట్లు సమాచారం. మరోవైపు సరిహద్దులోని పూంఛ్, రాజౌరి సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు ప్రారంభించింది. దీంతో భారత్ సైతం గట్టిగా తిప్పికొడుతోంది. ఎల్‌వోసీ వెంట ఇరు దేశాల సైనికుల కాల్పులతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడులు జరిగిన ప్రాంతాల్లో మురిద్కే టెర్రరిస్టు గ్రూప్ లష్కరే తొయిబాకు హెడ్ క్వార్టర్స్‌గా ఉంది. ఇక పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్పూర్‌లో మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ –ఎ– మహ్మద్ స్థావరం ఉంది.

**బట్టబయలైన పాక్ ఉగ్ర నెట్‌వర్క్: కీలక కేంద్రాలివే!**

భారత్ లక్ష్యంగా కార్యకలాపాలు సాగిస్తున్న పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మూలించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాక్ ప్రేరేపిత ఉగ్రసంస్థల గుట్టురట్టయింది. పాకిస్థాన్ సైన్యం, దాని నిఘా సంస్థ ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ప్రత్యక్ష మద్దతుతో నడుస్తున్న అనేక ఉగ్రవాద శిక్షణా కేంద్రాలు, స్థావరాల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కథనం పాకిస్థాన్ భూభాగం, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓజేకే)లో విస్తరించిన ఈ ఉగ్రవాద నెట్‌వర్క్ స్వరూపాన్ని వివరిస్తుంది.

పాకిస్థాన్ సైన్యం, ఐఎస్ఐలు లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం), హిజ్బుల్ ముజాహిదీన్ (హెచ్ఎం) వంటి పలు భారత వ్యతిరేక ఉగ్రవాద సంస్థలకు రహస్యంగా మద్దతు ఇస్తున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ సంస్థలకు ఆర్థిక, రవాణా, సైద్ధాంతిక, సైనిక సహకారాన్ని పాక్ సైన్యం క్రమపద్ధతిలో అందిస్తోంది, ఇందులో భాగంగా ప్రత్యక్ష పోరాట శిక్షణ కూడా ఇస్తున్నట్లు సమాచారం.

ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ఆంక్షల నేపథ్యంలో, పాకిస్థాన్ సైన్యం జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేసింది. ఎల్ఈటీ, జేఈఎం వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థలకు 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్), 'పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్' (పీఏఎఫ్ఎఫ్), 'కశ్మీర్ టైగర్' వంటి కొత్త పేర్లను పెట్టింది. ప్రపంచ ఉగ్రవాద నిఘా సంస్థల ఆగ్రహాన్ని తప్పించుకోవడానికి, ఉగ్రవాదాన్ని స్థానికంగా జరుగుతున్న ప్రతిఘటనగా చిత్రీకరించడానికి ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పాకిస్థానీ సైనిక అధికారులు తరచూ ఈ ఉగ్రవాద సంస్థల శిక్షణా శిబిరాలను సందర్శిస్తూ, శిక్షణా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

ఎల్ఈటీ, జేఈఎం వంటి ఉగ్రవాద బృందాలకు పాకిస్థాన్, పీఓజేకేలలో తమ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రభుత్వ సౌకర్యాలలో రహస్యంగా మౌలిక సదుపాయాలు కల్పించారు. అనేక శిక్షణా శిబిరాలు (మర్కజ్‌లు), నిర్లిప్త దళాలు ( డిటాచ్ మెంట్స్), లాంచ్ ప్యాడ్స్... ప్రస్తుతం సైనిక సౌకర్యాలు, కంటోన్మెంట్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమీపంలో నడుస్తున్నాయి. ఉదాహరణకు, సర్జల్ – తెహ్రా కలాన్ (జేఈఎం), మెహమూనా జోయా – సియాల్‌కోట్ (హెచ్ఎం) వంటి డిటాచ్ మెంట్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రాంగణంలో పనిచేస్తూ, ఉగ్రవాద కార్యకలాపాలకు అవసరమైన ముసుగును అందిస్తున్నాయి.

ఉగ్రవాద బృందాలకు సాంకేతిక నిఘాను తప్పించుకోవడానికి లాంగ్ రేంజ్ /అల్ట్రా సెట్‌లు, డిజిటల్ మొబైల్ రేడియో వంటి సైనిక శ్రేణి కమ్యూనికేషన్ పరికరాలను అందించారు. పాకిస్థాన్ సైన్యం, సరిహద్దు వెంబడి, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాక్–టీఎస్పీ సిగ్నల్‌ను బలోపేతం చేస్తూ, చొరబడిన ఉగ్రవాదులకు సహాయం చేస్తోంది. సర్జల్ – తెహ్రా కలాన్‌లోని నిర్లిప్త దళం, చొరబడిన ఉగ్రవాదులతో ప్రణాళిక, సమన్వయం కోసం హై–ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ సెటప్‌ను కలిగి ఉంది.

డిటాచ్ మెంట్స్, లాంచ్ ప్యాడ్స్ ఆయుధ శిక్షణ కార్యకలాపాలు, మతపరమైన బోధనలకు విస్తృతంగా ఉపయోగించబడుతుండగా, నిధులు సమకూర్చడం, ప్రచారం, విస్తరణ వంటి ఇతర సహాయక కార్యకలాపాలు మురిద్కేలోని మర్కజ్ తైబా (ఎల్ఈటీ), బహవల్పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా (జేఈఎం) వంటి దేశంలోని సురక్షిత ప్రాంతాల్లో ఉన్న పెద్ద సౌకర్యాలలో పాకిస్థానీ యంత్రాంగం మద్దతుతో జరుగుతున్నాయి. ఈ మర్కజ్‌లు ఉగ్రవాద సంస్థల ప్రధాన కమాండర్లకు నివాసాలుగా మాత్రమే కాకుండా, తీవ్రవాద బోధనలకు, నిఘా, ఆయుధాల వినియోగం వంటి వివిధ శిక్షణా కోర్సులకు కేంద్రాలుగా కూడా పనిచేస్తున్నాయి. అదేవిధంగా, మర్కజ్ అబ్బాస్ కోట్లీ (జేఈఎం), మర్కజ్ అహ్లే హదీస్, బర్నాలా (ఎల్ఈటీ) వంటి శిబిరాలు మతపరమైన బోధనలకు, కొత్తవారిని చేర్చుకోవడానికి, చొరబాట్లతో సహా ఉగ్రవాద కార్యకలాపాలను ప్లాన్ చేయడానికి స్థావరాలుగా విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. ఉగ్రవాద సంస్థలకు రవాణా, ఆర్థిక సహాయం మరియు కార్యాచరణ స్థావరాలను అందించడంతో పాటు, పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదుల శిక్షణను వ్యూహాత్మకంగా సులభతరం చేస్తోంది.

## భారత్ లక్ష్యం పాకిస్థాన్ కాదు.. ఉగ్రవాదులు మాత్రమే

భారత సైనికులు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మన సైనికులు రాత్రికి రాత్రే అద్భుత పరాక్రమం ప్రదర్శించి, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ) చేపట్టిన పలు ప్రాజెక్టులను ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "మన సైనికులు రాత్రికి రాత్రే అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఉగ్రవాద శిబిరాలపై అత్యంత సాహసోపేతమైన దాడులు చేసి తమ సత్తా చాటారు. ఈ ఆపరేషన్‌లో సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, కేవలం ఉగ్ర శిబిరాలనే లక్ష్యంగా చేసుకున్నారు" అని వివరించారు. పహల్గామ్‌లో అమాయక పౌరుల మరణానికి కారణమైన ఉగ్రవాదులనే మట్టుబెట్టామని ఆయన తెలిపారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్ లక్ష్యం పాకిస్థాన్ కాదని, కేవలం ఉగ్రవాదులు మాత్రమేనని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "ధైర్యసాహసాలు ప్రదర్శించిన మన సైనికులకు నా ధన్యవాదాలు. సరిహద్దు రాష్ట్రాల విషయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో, భారత సైన్యం ప్రతీకార చర్యలు చేపట్టింది.

సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై సైన్యం పూర్తి కచ్చితత్వంతో దాడులు నిర్వహించినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. ఈ దాడుల్లో పాకిస్థాన్ సైనిక సదుపాయాలపై ఎలాంటి దాడి జరగలేదని, తద్వారా ఉద్రిక్తతలు మరింత పెరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## భారత్‌కు యుద్ధం చేసే ఆలోచన లేదు.. కానీ పాక్ రెచ్చగొడితే తొక్కిపడేస్తాం

న్యూఢిల్లీ: పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్?కు భారత్ రివేంజ్ తీర్చుకుంది. 26 మంది అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులపై విరుచుకుపడింది. 2025, మే 6 మంగళవారం అర్ధరాత్రి తర్వాత 1.44 గంటలకు పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)తో పాటు పాక్‌లోని 9 టెర్రరిస్ట్ స్థావరాలపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మెరుపు దాడులు చేసింది. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మిస్సైళ్లు, బాంబుల వర్షం కురిపించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ చేపట్టిన ఈ కౌంటర్ ఎటాక్?లో లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలకు చెందిన దాదాపు 90 మంది టెర్రరిస్టులు హతమయ్యారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి వివిధ దేశాలకు చెందిన భద్రతా సలహాదారులతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చర్చించారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, యూకే ఎన్ఎస్ఏ జోనాథన్ పావెల్, సౌదీ ఎన్ఎస్ఏ ముసైద్ అల్ ఐబాన్, యూఏఈ ఎన్ఎస్ఏ షేక్ తహ్నూన్, యూఏఈ ఎన్ఎస్సీ సెక్రటరీ జనరల్ అలీ అల్ షమ్సీ, జపాన్ ఎన్ఎస్ఏ మసటకా ఒకానో, సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు,

పీఆర్సీ విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ బోన్ యొక్క దౌత్య సలహాదారు, రష్యన్ ఎన్ఎస్ఏ సెర్గీ షోయిగుతో బుధవారం (మే 7) అజిత్ దోవల్ ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి వారికి వివరించారు. ఆపరేషన్ సిందూర్?లో భాగంగా తీసుకున్న చర్యలు, దాని అమలు విధానం గురించి వాళ్లకు చెప్పారు. పహల్గాంలో ఉగ్రదాడికి కౌంటర్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచే ఆలోచన భారత్?కు లేదని చెప్పిన అజిత్ దోవల్.. పాక్ రెచ్చగొడితే మాత్రం దానికి ధీటుగా తప్పకుండా బదులిస్తామని ప్రపంచదేశాలకు అజిత్ దోవల్ స్పష్టం చేశారు. భవిష్యత్ లోనూ మా మిత్ర దేశాలతో సమాచారం పంచుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ

పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు బుధవారం తెల్లవారుజామున కచ్చితమైన దాడులు నిర్వహించాయి. ఈ కీలక పరిణామం అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యకు సంబంధించిన వివరాలను ప్రధాని రాష్ట్రపతికి వివరించారు. ఈ దాడుల్లో భాగంగా, పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం) వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది కీలక స్థావరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ధ్వంసం చేసిన వాటిలో ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు కూడా ఉన్నాయని తెలిసింది. భారతదేశంపై ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించడం, వాటిని నిర్దేశించడం వంటి కార్యకలాపాలు ఈ కేంద్రాల నుంచే జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతోనే సైన్యం ఈ దాడులు చేపట్టింది.

రెండు వారాల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఒక నేపాల్ దేశస్థుడితో సహా 26 మంది అమాయక పౌరులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటన జరిగిన అనతికాలంలోనే భారత సాయుధ దళాలు ఈ ప్రతిదాడులకు దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని భారత్ మరోసారి స్పష్టం చేసినట్లయింది.

## ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే... ఉగ్రవాద శిబిరాలపై దాడులు అనివార్యం

- మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాద స్థావరాలు, వారి శిక్షణ శిబిరాలపై దాడులు చేయడం అనేది దేశ రక్షణలో కీలకమైన భాగమని అభిప్రాయపడ్డారు. "దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం" అని ఆయన స్పష్టం చేశారు.

కశ్మీర్‌లోని పహల్గామ్ లో అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని జగన్ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఇటువంటి క్రూరమైన ఉగ్ర చర్యలను భారత రక్షణ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని ప్రశంసించారు.

"అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది" అని జగన్ తెలిపారు. దేశ పౌరుల భద్రత లక్ష్యంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న ప్రతి చర్యకు దేశం మొత్తం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్ కౌంటర్... 22 మంది మావోలు మృతి

- మొదటి పేజీ తరువాయి

డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), కోబ్రా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), బస్తర్ ఫైటర్స్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) కు చెందిన బలగాలు సంయుక్తంగా ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. ఈ కీలక ఆపరేషన్‌ను అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) వివేకానంద సిన్హా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది.సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందరరాజ్ లు ఎప్పటికప్పుడు ఆపరేషన్ పురోగతిని సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలోని బలగాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఎదురుకాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## భారత సాయుధ దళాలకు నా సెల్యూట్.. ఏపీ సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

వేగంగా ప్రతీకారం తీర్చుకున్న భారత సాయుధ దళాల యోధులకు నేను గర్వంగా సెల్యూట్ చేస్తున్నాను. వారి అసమాన ధైర్యం, కచ్చితత్వంతో, ఉక్కు సంకల్పంతో మన దేశం తనను తాను రక్షించుకుంటుందని వారు మళ్లీ నిరూపించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. పాకిస్థాన్, పీవోకేలో దాడుల తర్వాత భారత సాయుధ దళాలను ప్రశంసించిన మొదటి రాజకీయ నాయకులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో దేశభక్తితో కూడిన 'జై హింద్!' అంటూ తన మద్దతు ప్రకటించారు. సాయుధ దళాల విజయాన్ని గుర్తించిన తొలి స్వరాలలో ఇది ఒకటి. తరువాతి పోస్ట్‌లో సాయుధ దళాల అసాధారణ ధైర్యాన్ని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని చంద్రబాబు ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు పూర్తి మద్దతును వ్యక్తం చేస్తూ, మోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని ప్రశంసిస్తూ "ఈ రోజు, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచం మన బలం, దృఢ సంకల్పాన్ని చూసింది. మన దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉంది. మన సాయుధ దళాలకు మద్దతు ఇస్తుంది" అని ప్రకటించారు.

## వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే మిస్సైల్ మన దగ్గరుంది

- మొదటి పేజీ తరువాయి

స్పందించారు. ఇటీవల అమరావతి సభలో తాను ప్రధాని మోదీ సమక్షంలో చేసిన వీడియోను ఆయన నేడు ఎక్స్ లో పంచుకున్నారు.

"పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక పాకిస్థాన్ కాదు... వంద పాకిస్థాన్ లు వచ్చినా భారతదేశంపై మొలచిన గడ్డి కూడా పీకలేరు. వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైల్ ఏంటో తెలుసా? 'నమో'. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారు" అని లోకేశ్ భావేద్వేగంతో మాట్లాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వీడియోను షేర్ చేశారు.

## వైసీపీలో చేరిన ఏపీ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు... కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగన్

ఏపీ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. ఆయనకు జగన్ వైసీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ... మాట తప్పని, మడం తిప్పని నాయకుడు జగన్ అని కితాబునిచ్చారు. జగన్ లాంటి వ్యక్తిని మళ్లీ సీఎం చేసుకువాలనే బలమైన సంకల్పంతో పార్టీ కోసం పని చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పోలీసులకు సరెండర్ లీవులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని అన్నారు. వైసీపీ ఎంప్లాయిస్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... జగన్ కు మద్దతుగా ఉద్యోగ సంఘాల నేతలు పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

## నేటి నుండి ప్రారంభం కానున్న పెంచలకోన బ్రహ్మోత్సవాలు




**రాపూరు /డక్కిలి /పెన్ పవర్/మే7:** మే 8 నుండి 14 వరకు పెంచలకోన బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలన చేయడం జరిగింది. వివిధ ప్రాంతల నుండి భక్తులు రావడం ను ఉద్దేశించి రాపూరు ఆర్ టి సి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు :

మే 8 న అంకురార్పణ
మే 9 న శేష వాహన సేవ
మే 10 న హంస వాహనం
మే 11 న సింహ వాహన సేవ, గరుడ సేవ
మే 12 న శ్రీవారి తిరు కళ్యాణం, రథోత్సవం
మే 13 న చక్రస్నానం, తెప్పోత్సవం, అశ్వవాహన సేవ
మే 14 న స్వామి వారి గ్రామోత్సవం, పల్లకి సేవ జరుగనున్నాయి.

ఈ సందర్భంగా ఆలయంన్ని శోభానమయంగా అలంకరించి ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ కమిటీ తెలిపింది.

# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా

### శ్రీ సిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు

## నేడు ఆర్టీజి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన



**శ్రీ సిటీ, పెన్ పవర్, మే 7 :** శ్రీసిటీలో ప్రారంభించనున్న ఎల్‌జీ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ప్రపంచ ఎలక్ట్రానిక్ రంగంలో దిగ్గజమైన ఎల్‌జి కంపెనీ రేపు సుమారు 5 వేల కోట్ల రూపాయల పైబడిన పెట్టుబడితో దేశంలో తన మూడవ యూనిట్‌ను శ్రీ సిటీలో ఏర్పాటు చేయనున్న సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మరియు ఆర్‌టిజి శాఖ మంత్రి నారా లోకేష్ భూమి పూజ చేయనున్నారు. ఎల్జీ కంపెనీ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్ర ఎలక్ట్రానిక్ ఐటి విద్యాశాఖ మంత్రి మంత్రి లోకేష్ వస్తుండడంతో నేడు ముందస్తు ఏర్పాట్లను శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడిషనల్ ఎస్పీ రవి మనోహ రాచారి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఎల్జీ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించారు.



## ప్రతి చేనేత కార్మికుడు ఒక పారిశ్రామిక వేత్త కావాలి

### చేనేత కార్మికులు సొసైటీలుగా ఏర్పాటై ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : చేనేత & జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి



కర్నూలు, పెన్ పవర్ మే 07: ప్రతి చేనేత కార్మికుడు ఒక పారిశ్రామిక వేత్త కావాలని చేనేత & జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో చేనేత కార్మికుల ఐడి కార్డులు, సొసైటీ ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చేనేత & జౌళి శాఖ కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు సొసైటీ లుగా ఏర్పాటై ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.. సొసైటీ లుగా ఏర్పడినప్పుడే ముద్ర రుణాలు, హెల్త్ ఇన్సూరెన్స్, యార్న్ సబ్సిడీ వంటి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.. 2 వేల 849 మంది చేనేత కార్మికులకు పెన్షన్ లు ఇస్తున్నారని, అయితే కేవలం 3 సొసైటీ లు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయన్నారు. అర్హులైన చేనేత కార్మికులు అందరూ సొసైటీ లుగా ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ డీఆర్డీఏ, మెప్మా, చేనేత శాఖ అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపినట్లయితే చేనేత ప్రక్రియలకు ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్) కింద నిధులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.. స్కిల్ అప్గ్రేడేషన్ కింద లక్ష 50 వేల రూపాయలు, టెక్నికల్ టెక్నాలజీ అప్గ్రేడేషన్, డిజైన్ డెవలప్మెంట్ తదితర అంశాలకు దాదాపు రూ. 10 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు.. ఉత్పత్తు లను తయారు చేసి అమ్మితే వారికి దాదాపు 5 లక్షల 82 వేల రూపాయలు లాభం వచ్చే అవకాశం ఉంటుందన్నారు.. మరల రెండవ దఫా కింద కూడా 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తద్వారా చేనేత లు పారిశ్రామిక వేత్తలుగా మారుతారన్నారు..కాంచీపురం లో చేనేత సొసైటీలు విజయవంతంగా నడుస్తున్నాయని, చేనేత కార్మికులకు స్టడీ టూర్లు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆన్లైన్ ద్వారా ఎన్రోల్మెంట్ చేసుకున్న వారికి చేనేత ఐడి కార్డులు మంజూరు చేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కమిషనర్ సూచించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలను 30 మందిని కలిపి ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్డిఏ, మెప్మా పీడీలను ఆదేశించారు.

ఇందుకు సంబంధించి గ్రూపు సభ్యులతో సమావేశాన్ని నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. అలాగే సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేనేత జౌళి శాఖ ఏడిని ఆదేశించారు. ఎన్ఎల్ఆర్ఎమ్ పథకం ప్రయోజనాలను గురించి తెలుగు లో కరపత్రాలను ముద్రించి స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలకు పంపిణీ చేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ మెప్మా పిడి, డిఆర్డిఏ పిడి లను ఆదేశించారు. ఎమ్మిగనూరు ఎంఎల్ఏ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మిగనూరులో 3 వేల నుండి 4 వేల తరువాయి 4లో..

## ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రను కాపాడుదాం

### - టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు



తిరుమల పెన్ పవర్ మే 7 : ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఏడుకొండలకు ఆనుకొని ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించరాదని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో బుధవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇది వరకే తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలోని సర్వే నెం.604లో ఆంధ్ర ప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)కు చెందిన 24.68 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించాలని గతంలో టిటిడి బోర్డు నిర్ణయం తీసుకోవడమైనది. ఆ స్థలానికి బదులుగా తిరుపతి అర్బన్ సర్వే నెం.588-ఏలో ఉన్న టీటీడీకి చెందిన 24.68 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏ బదలాయింపునకు టిటిడి బోర్డు ఆమోదం తెల్పింది. అదేవిధంగా తిరుపతి రూరల్ లోని సర్వే నెం.604లోని ఏపీటీఏకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టీటీడీకి బదలాయించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్ లోని సర్వే నెంబర్ 588-ఏ లోని టీటీడీకి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని టిటిడి బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమైంది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు వి.ప్రశాంతి రెడ్డి, పనబాక లక్ష్మి, జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, ఎం.శాంతారామ్, టి.జానకీదేవి, జీ.భానుప్రకాష్ రెడ్డి పాల్గొనగా, వర్చువల్ మీటింగ్‌లో జ్యోతుల నెహ్రూ, ఎం.ఎస్.రాజు, ఎస్ నరేష్ కుమార్, సుచిత్ర ఎల్లా, ఎన్.నర్సిరెడ్డి, ఎ.మునికోటేశ్వర రావు, సుచిత్ర ఎల్లా, ఎన్.నర్సిరెడ్డి, ఎ.మునికోటేశ్వర రావు, దేవాదాయ శాఖ సెక్రటరీ వినయ్ చంద్, కమిషనర్ రామచంద్ర మోహన్ పాల్గొన్నారు.

## ఆర్టిజి శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం





**రేణిగుంట, పెన్ పవర్ మే 7 :** తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం నేటి బుధవారం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మరియు ఆర్టిజీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి ఘన స్వాగతం లభించింది. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్, ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నగరి, వెంకటగిరి, సత్యవేడు, గూడూరు ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుదీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, గాలి భానుప్రకాష్, కురుకొండ్ల రామకృష్ణ, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, చూడ చైర్‌పర్సన్ కటారి హేమలత, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం మంత్రి నారా లోకేష్ రోడ్డు మార్గాన సత్యవేడుకు బయల్దేరి వెళ్ళారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టండి

### ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

### : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం, పెన్ పవర్ మే 07 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించే ప్రాంతాలలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) ద్వారా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ఈనెల 09వ తేదీన ముఖ్యమంత్రి ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ వెడల్పు పనులను పరిశీలించేందుకు విచ్చేయనున్నారు. ఈనేపథ్యంలో బుధవారం ఛాయపురం గ్రామ పరిసరాలలో పర్యటించే ప్రదేశాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఎస్.ఎస్.జి ఆఫీసర్స్ కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి అన్ని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్వాయ్‌కి సంబంధించిన రూట్ ను పరిశీలించారు. హెలిప్యాడ్, హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనుల ప్రదేశాలు, సభా వేదిక ప్రదేశాన్ని మరియు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని, పార్కింగ్ స్థలాలు వద్ద బందోబస్తు మరియు భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్, ఎస్పీలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. హెలిప్యాడ్ ను వెంటనే సిద్ధం చేయాలని, మార్కింగ్ ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని, అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించేందుకు అవసరమైన గదిని ఏర్పాటు చేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో గురువారం మధ్యాహ్నంలోగా పనులన్నీ పూర్తి అయి సిద్ధంగా ఉండాలన్నారు. కాలువ వెడల్పు చేస్తే ఎలా ఉంటుంది, పనులు చేయకముందు ఎలా ఉంటుంది అనేది స్పష్టంగా తెలిసేలా పనులు చేయాలన్నారు. కాలువలో నీరు ఉండరాదని, చాలా వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజావేదిక వద్ద ఏర్పాట్లను పూర్తిచేయాలని, సభలోకి విఐపిలు, ప్రజలు వచ్చిపోయేందుకు అవసరమైన దారులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావేదిక వద్ద కంప చెట్లను తొలగించాలన్నారు. హెలిప్యాడ్, సభా వేదిక, తదితర ప్రాంతాలో ఏఎస్ఎల్ నిర్వహించి అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఐపీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సిఎంఓ కార్యాలయం అధికారులు దినేష్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు (ఐ.ఎస్.డబ్ల్యూ.ఓ), ఏఎస్పీ రమణమూర్తి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణచౌదరి, సర్వే ఏడి రూప్ల నాయక్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అల్లూరి సీతారామరాజు ఒక పోరాట స్ఫూర్తి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు పెన్ పవర్ మే07 :** అల్లూరి సీతారామరాజు ఒక పోరాట స్ఫూర్తి అని, వారి ధైర్య సాహసాలు యువతకు ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు గారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని.. ఆయన జరిపిన పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సమాజం కోసం ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు.. అల్లూరి సీతారామరాజు ను ఆదర్శంగా తీసుకొని దేశ, సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. అల్లూరి సీతారామరాజు చరిత్రను విద్యార్థులు అంతా తప్పకుండా తెలుసుకోవాలని, అల్లూరి స్ఫూర్తి ని ఆదర్శంగా తీసుకుని నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. అల్లూరి సీతారామరాజు 1897 సంవత్సరం లో జన్మించి కేవలం 27 ఏళ్లు మాత్రమే జీవించి సమాజం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు. దేశం కోసం, అడవి బిడ్డల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. అప్పట్లో బ్రిటిష్ వారు మన్యంలో ఉన్న గిరిజనులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసేవారని, అడవి లో ఉండే ఉత్పత్తులు సేకరించి అమ్ముకునే వారిపై దమనకాండ చేస్తుండగా బ్రిటిష్ వారిపై వివిధ రకాలుగా పోరాడి వారికి విముక్తి కల్పించిన వ్యక్తి అల్లూరి అన్నారు. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ యువత ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ,సిపిఓ హిమప్రభాకర్ రాజు, కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా టూరిజం అధికారి విజయ,జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.35 లక్షలతో అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ మే 07 :** రాజన్న ఫౌండేషన్స్ ద్వారా కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిత్తూరు జిల్లాకు ఒక అంబులెన్స్, పాఠశాల ఆధునీకరణకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ.35 లక్షల విలువ గల అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబ్యులెన్స్ ను చిత్తూరు, పూతలపట్టు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్ లతో కలసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆముద,అమర్ రాజా ఆస్పత్రి ఎండి డా.రమాదేవి,చుడా చైర్ పర్సన్ కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న ఫౌండేషన్ ద్వారా కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు రూ.35 లక్షలతో అంబులెన్స్, పూతలపట్టు నియోజకవర్గం పి.కొత్తకోట పాఠశాలకు రూ.15 లక్షలు మొత్తం రూ.50 లక్షల రూపాయలు అందించడం జరిగింది. అంబులెన్స్ లో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ మరియు అడ్వాన్స్ సి ఆర్ పి సౌకర్యం ఉన్నాయన్నారు.జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. చిత్తూరు శాసన సభ్యులు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం కోరిక మేరకు రాజన్న ఫౌండేషన్ ద్వారా అందించిన అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడడంలో సహాయపడుతుందన్నారు.

పాక్ తీవ్రవాద చర్యకు బదులిస్తూ భారత్ చేసిన వైమానిక దాడులకు చిత్తూరు నియోజకవర్గ ప్రజల తరపున అభినందనలు తెలిపారు. తీవ్రవాదాన్ని తరిమికొట్టడానికి భారత ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం, భారత సాయుధ దళాలు తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నానన్నారు. పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక భాద్యతలో భాగంగా రాజన్న ఫౌండేషన్స్, అమరాజ సంస్థ, అమరా ఆసుపత్రి సంయుక్తంగా జిల్లాకు అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ కలిగిన అంబులెన్స్ మరియు పి.కొత్తకోటలో ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణకు ఆర్థిక సహాయం తరువాయి 4లో..

# ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షకు 610 మంది హాజరు



**తిరుపతి, పెన్ పవర్ మే 07 :** జిల్లాలో బుధవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 610 (66.96శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని, 911 అభ్యర్థులకు గాను 610 అభ్యర్థులు హాజరయ్యారని వెరసి మొత్తం 66.96 శాతం హాజరయ్యారని, 301 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

# పౌర రక్షణకు పటిష్టమైన భద్రతా చర్యలు..

### - జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ మే 6 :** దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా.. భారత హెూం మంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోంది. సివిల్ డిఫెన్స్ రూల్స్ -1968 లోని సెక్షన్ 19 కింద, హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం నిర్దేశించిన జిల్లాల్లో పౌర రక్షణ మాక్ డ్రిల్, రిహార్సల్ నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని.. ఈ మేరకు భారత ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత భూభాగాలలో పౌర రక్షణ యంత్రాంగాల సంసిద్ధతను అంచనా వేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ప్రణాళిక ప్రకారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో.. జిల్లా యంత్రాంగం, వివిధ జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు/వాలంటీర్లు, హెూమ్ గార్డ్ (యాక్టివ్/రిజర్విస్ట్ వాలంటీర్లు), ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకెలు, కళాశాల/పాఠశాల విద్యార్థుల చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణతో దేశం చేపట్టే పౌర రక్షణ చర్యల కార్యాచరణ, సమర్థత, సమన్వయాన్ని అంచనా వేయడం జరుగుతోందన్నారు.

# సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్

**కర్నూలు, పెన్ పవర్ మే 07 :** అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లాలోని కీలక ప్రదేశాల్లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఎన్‌సిసి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ ద్వారా మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయన్నారు.. ఆ మేరకు జిల్లాలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్, ఇతర పారిశ్రామిక ప్రాంతాలు, డిఆర్డీవో, మంత్రాలయం దేవాలయం చుట్టుపక్కల గ్రామాలు, కొండారెడ్డి బురుజు ప్రాంతం తదితర ముఖ్యమైన ప్రదేశాల్లో ఈ రోజు సాయంత్రం లోపు మాక్ డ్రిల్ నిర్వహించి నివేదిక అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, పోలీస్, ఫైర్, ఎన్‌సిసి అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు..మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ ద్వారా జారీ చేసిన ఎస్వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ప్రకారం మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు..మాక్ డ్రిల్ చేసే ముందు ప్రజలు భయాందోళనలకు గురి కాకుండా ముందుగా సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.. అడిషనల్ ఎస్పీ, సబ్ కలెక్టర్, ఆర్డీవో లతో ఈ అంశంపై మాట్లాడారు. టెలి కాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ, డిఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు భరత్ నాయక్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ భారత సైనికులకు మద్దతుగా పూజలు చేసిన కోలా ఆనంద్





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** పెహల్ గామ్ ఉగ్రదాడిలో భారతీయ ఆడపడుచుల నుదుటి తిలకం చెరిపిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సూచనలతో భారత సైన్యం మెరుపు దాడి చేసి ఉగ్రవాదుల అంతమే భారత లక్ష్యమని ఈ ఆపరేషన్ సిందూరలో భారత సైనికులు క్షేమంగా ఉండాలని, మరింత లిలిశక్తి సామర్థ్యాలులి పొందాలని నేడు శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్న చక్రేశ్వర స్వామిలిఆలయంలో పూజలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ మహా దేవుని యొక్క ఆశీస్సులు భారత సైనికులకు ఎల్లవేళలా ఉండాలని, మరింత శక్తి సామర్థ్యాలు చేకూర్చాలని ప్రార్థించడం జరిగినది.ఇది కేవలం ప్రారంభం మాత్రమే అని ఇలాంటి మిస్సైల్ దాడులు మరెన్నో జరిగి తీవ్రవాదులు ఎక్కడ దాగి ఉన్న వదిలిపెట్టేది లేదని ఈ విషయంలో ప్రధాని మంత్రివర్యులు నరేంద్ర మోడీ, ఇప్పటికే చెప్పడం జరిగినది పేర్కొన్నాను.

# గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా బ్రిటిష్ పాలకులను ఎదిరించిన అల్లూరి స్ఫూర్తిదాయం : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్





**తిరుపతి, పెన్ పవర్ మే 7 :** గిరిజనుల సామాజిక, ఆర్థిక దుర్భర పరిస్థితులను చూసి చలించిపోయి వారి సంక్షేమమే ధ్యేయంగా బ్రిటిష్ పాలకులను ఎదిరించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరము నందు SETVEN వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని తెలిపారు. విశాఖ జిల్లా పాండ్రంగిలో 1897 జులై 4న అల్లూరి సీతారామరాజు జన్మించారని వారి స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా మోగల్లు అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం సాధ్యమని నమ్మి తన ప్రాణాలను సైతం అర్పించిన మహాయోధులు అల్లూరు సీతారామరాజు అన్నారు.

గిరిజన ప్రాంత ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షనురగిలించడంలో అల్లూరి సీతారామరాజు ప్రముఖ పాత్ర పోషించారు అని అన్నారు. భారతదేశంలో బ్రిటిష్ వారు చేస్తున్న దోపిడీపై గిరిజన ప్రజలలోచైతన్యం కలిగించడంలో ప్రత్యేక కృషి చేశారని కొనియాడారు. కావున అల్లూరి సీతారామరాజు ఆదర్శాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తి గా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో setven సీఈవో మోహన్ కుమార్, దేశ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడూ దేశ భద్రతకు భాగస్వామి కావాలి : నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు





**ధర్మవరం పెన్ పవర్ మే 07 :** ధర్మవరం పట్టణంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా దేశ భద్రత కోసం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్‌ను ప్రజలకు వివరించి, దేశభక్తి భావాలను ప్రోత్సహించారు. ర్యాలీ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, భారత సైన్యం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటింది. ఈ విజయాన్ని ప్రజలతో పంచుకోవడం మా బాధ్యత, అని అన్నారు. అలాగే, దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, యువత, మహిళలు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ర్యాలీ సమయంలో జాతీయ జెండాలు పట్టుకుని జై హింద్, భారత్ మాతా కీ జై వంటి నినాదాలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ ప్రజల్లో దేశభక్తి భావాలను రేకెత్తించింది.

ర్యాలీ ముగింపు సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, భారత సైన్యం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటింది. ఈ విజయాన్ని ప్రజలతో పంచుకోవడం మా బాధ్యత, అని అన్నారు. అలాగే, దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ద్వారా ధర్మవరం ప్రజలు దేశ భద్రతపై తమ మద్దతును వ్యక్తపరిచారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని హరీష్ బాబు తెలిపారు.

# లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ మే 07 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలోనున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయా శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.


కార్యక్రమానికి గ్రామస్తులు, కార్యకర్తలు, ఆయకట్టుదారులు, అందరూ కలిసి 3,000 మంది హాజరయ్యేలా చూడాలని, ఇందుకోసం మొబిలైజేషన్ చేయాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, అన్నిచోట్ల శుభ్రంగా ఉండాలని, ఎక్కడ ప్లాస్టిక్ పేపర్లు ఉండకుండా చూసుకోవాలని డిపిఓని ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద షామియానా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వేదిక సభ వద్ద ప్రతి బ్లాక్ లోను ఒక విఆర్ఓ ఉండాలన్నారు. వీఐపీలకు భోజనం ఏర్పాటు, కార్యక్రమానికి హాజరయ్యే అధికారులకు, పోలీసులకు, గ్రామస్తులకు భోజనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. హెలిప్యాడ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక గది, సీఎం కార్యదర్శికి ఒక గది ఏర్పాటు చేయాలని, అక్కడ స్నాక్స్, నీళ్లు, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. మెనూ చక్కగా ఉండాలని, అందరికీ మంచి భోజనం అందజేయాలన్నారు.


బంగారు కుంటుంభంకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపును పూర్తి చేయాలని, వారికి జీరో పావర్టీ పి4 బంగారు కుంటుంభం గురించి అవగాహన కల్పించాలని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని సర్పంచ్, ఎంపీడీవోను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను కూడా గుర్తించాలన్నారు. వాహనాల పార్కింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అనంతరం ఛాయాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పర్యటించి, జీరో పావర్టీ పి4 బంగారు కుంటుంభంకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. గ్రామంలోని మహేశ్వరి, కె.బాలు, బోయ రాఘవ, టి.రంగనాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులు, ఆదాయ వనరులు, వృత్తి, భూమి, ఎలాంటి లబ్ధి పొందారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలని కోరుకుంటున్నారు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బంగారు కుంటుంభంకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మాలోల, జడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎల్డివోలు లలితబాయి, విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి మరియు సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, డ్వామా పిడి సలీమ్ భాష, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

### - హామీల అమలు దిశగా చర్యలు - స్వలాభం కోసం వేరు కుంపటి

### - శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సమావేశంలో పలు అంశాలపై చర్చ - ఏక్రగ్రీవంగా చర్చనీయాంశాలపై తీర్మానం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సాధారణ సమావేశం బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటేశ్వరబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సభ్యులందరి ఏకగ్రీవ అమోదంతో పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ ఒక సంవత్సర కాలపరిమితితో ఏర్పాటైన ఈ ప్రెస్ క్లబ్ కార్యవర్గం బాధ్యతలు చేపట్టి ఆరు నెలల కాలం గడిచిందన్నారు. కార్యవర్గం ఎన్నికైన రోజుల వ్యవధిలోనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రెస్ క్లబ్‌కు మున్సిపాలిటీకి చెందిన పాత ఈ సేవా కార్యాలయం వద్ద కార్యాలయానికి గదిని కేటాయించారని తెలిపారు. అలాగే ఈ ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన విషయం అందరికీ తెలిసిందేన న్నారు. ఆ తర్వాత ఎన్నికైన కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణకు ప్రమాణ స్వీకారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమయంలో ఇదివరకు ప్రెస్ క్లబ్ కమిటీలో ఉన్న, సభ్యులు కొంత మంది వివిధ కారణాలతో తటస్థంగా ఉంటూ వచ్చారు. కమిటీ సభ్యులు పలుమార్లు ఆహ్వానం పలికితే కొంత మంది మాత్రం ప్రెస్ క్లబ్ కార్యాలయానికిరాగా మరికొంత మంది మాత్రం స్పందించ లేదు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రెస్‌క్లబ్ సభ్యులుగానున్న జర్నలిస్టు మిత్రుల సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించారని చెప్పారు.

# ప్రతి చేనేత కార్మికుడు ఒక పారిశ్రామిక వేత్త కావాలి



**(3వ పేజీ తరువాయి)** వరకు చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఐడి కార్డులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.. ఎమ్మిగనూరు ఎంఎస్ఎంఈ పార్కులో ముందుగా 25 ఎకరాల్లో మౌలిక వసతులు, ఎకో సిస్టమ్, ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు..ఎమ్మిగనూరు చీరలకు విశిష్టత ఉందని, ఎమ్మిగనూరు బ్రాండ్ కు ప్రత్యేకత తీసుకువచ్చి చేనేత కార్మికులను ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హ్యాండ్లూమ్ ఏడి నాగరాజారావు, ఎమ్మిగనూరుచేనేత కార్మికులు, మెప్మా పీడీ నాగ శివ లీల, డిఆర్డియే ఎపిడి, ఎల్డీఎం తదితరులు పాల్గొన్నారు.

# రూ.35 లక్షలతో అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



**(3వ పేజీ తరువాయి)** అందించారన్నారు. పూతలపట్టు నియోజకవర్గం పి.కొత్తకోట నుండి చంద్రగిరి నియోజకవర్గం వరకు ఉన్న జాతీయ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నవని, క్షతగాత్రులకు అత్యవసర వైద్య సహాయంతో ఆసుపత్రికి తరలించడానికి ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుందన్నారు. సామాజిక భాద్యతలు నిర్వహించడంలో అమరాజ సంస్థ, అమరా ఆసుపత్రి, రాజన్న ఫౌండేషన్స్ తమ దాతృత్వాన్ని చాటడంలో ముందుటారన్నారు. ప్రభుత్వానికి సహకారం అందిస్తున్న సంస్థకు పూతలపట్టు నియోజక వర్గం ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారత ప్రభుత్వం ఆర్మీ ద్వారా ఆపరేషన్ సింధూర్ ను సమర్థవంతంగా నిర్వర్తించిందని, ఉగ్రమూకల ను అంతం చేయడంలో భారత ప్రభుత్వానికి పూతలపట్టు నియోజకవర్గ ప్రజల తరఫున పూర్తి మద్ధతు తెలుపుతున్నామన్నారు. అమర్ రాజా ఆస్పత్రి ఎండి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి రూ.35 లక్షలతో అంబులెన్స్ ను అందించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర వైద్య సేవలను అందించడంలో వైద్య వ్యవస్థ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నానన్నారు. చిత్తూరు జిల్లా తన పుట్టినిలు అని, అత్యవసర వైద్య సేవలు అందించడంలో అమరా ఆసుపత్రి తరఫున సహాయం అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డా.పద్మాంజలి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ అపోలో హెడ్ నరేష్ కుమార్ రెడ్డి సంబంధిత డాక్టర్లు అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కి ప్రతిష్ఠాత్మక రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ ప్రదానం

అనంతపురం పెన్ పవర్ మే 7 : అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS), అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్ గారి సమర్థవంతమైన నాయకత్వంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. వీటిలో ఓల్డ్ టౌన్‌లో RO వాటర్ ప్లాంట్ స్థాపన, 25 కిలోవాట్ల సోలార్ పవర్ సిస్టమ్ ఏర్పాటు, అఫెరిసిస్ మెషిన్ సమకూర్చడం, ప్లేట్‌లెట్ అజిటేటర్స్ స్థాపన, ఆటో ఇమ్యూనోఅస్సే అనలైజర్ ప్రవేశపెట్టడం, మరియు IRCS DY కుల్లాయప్ప ఐ రిట్రీవల్ సెంటర్ ఏర్పాటు వంటి కీలకమైన సేవలు ఉన్నాయి. అంతేకాకుండా, 91 రక్తదాన శిబిరాల ద్వారా 5,872 యూనిట్ల రక్తం సేకరించడం, వాటిని 9,479 మంది ప్రాణాపాయంలో వున్నవారికి సరైన సమయంలో అంధ చేయడం, మరియు జిల్లా రక్త కేంద్రానికి ISO 9001:2015 ధృవీకరణ పొందడం వంటి విజయాలు సాధించారు మరియు జూనియర్/యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాల్లో 5,621 మంది విద్యార్థుల చేరికతో సమాజ సేవలో అనంతపురం జిల్లా కొత్త ఒరవడిని సృష్టించింది. ఈ అసాధారణ సాధనలకు గుర్తింపుగా, డాక్టర్ వి. వినోద్ కుమార్ గారికి ప్రతిష్ఠాత్మక రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును గౌరవనీయ గవర్నర్ మరియు రాష్ట్ర రెడ్ క్రాస్ అధ్యక్షులు శ్రీ అబ్దుల్ నజీర్ గారి చేతుల మీదుగా తేదీ 08.05.2025 న రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగే అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవ కార్యక్రమంలో అందుకోవాలని రాజ్‌భవన్ నుండి ఆహ్వానం అందింది. ఈ గౌరవప్రదమైన సందర్భంలో, జిల్లా ఆరోగ్య సంరక్షణ మరియు సామాజిక సంక్షేమంలో డాక్టర్ వినోద్ కుమార్ గారి అసమాన నాయకత్వం అంకితభావాన్ని IRCS అనంతపురం జిల్లా శాఖ హృదయపూర్వకంగా కొనియాడుతుంది. మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము లో 2023-24మరియు 2024-25సంవత్సరములకు గాను కేవలం 9 మంది కలెక్టర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా అందులో రాయల సీమ జిల్లాల నుంచి కేవలం అనంతపురము జిల్లాకు ఈ అవార్డు రావటం జిల్లా కలెక్టరు గారి నిబద్ధతకు సేవ నిరతతికి నిదర్శమని ఈ విజయం జిల్లా ప్రజలందరికీ గర్వకారణం మరియు సమాజ సేవలో మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ప్రేరణనిస్తుంది.

# శ్రీకాళహస్తి లాడ్జీల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** శ్రీకాళహస్తిలోని లాడ్జీ యజమానులు, మేనేజర్లతో డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం సమావేశం నిర్వహించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, సందేహాస్పద వ్యక్తులపై నిఘా పెట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గెస్ట్ వివరాలు నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని సూచించారు. భద్రతాపరంగా లాడ్జీ యజమానులు తమకు సహకరించాలని కోరారు. వన్ టౌన్ సీఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ మే 07 :** మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తి, వారి ఆదర్శ బాటలో మనందరం నడవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్. పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి మాట్లాడుతూ.. శ్రీ అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ లో పుట్టడం అందులోనూ మన తెలుగు వాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమని తెలిపారు. గతంలో నేను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం, పార్వతీపురం వివిధ గిరిజన ప్రాంతాలలో పనిచేయడం శ్రీ అల్లూరి సీతారామరాజు గారు తిరిగిన ప్రాంతాలలో సందర్శించడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు 27 సంవత్సరాలు మాత్రమే జీవించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్రిటిష్ వారికి విరుద్ధంగా రెండున్నర సంవత్సరాలు బ్రిటిష్ వారు అటవీ ప్రాంతాన్ని దోపిడి చేసి అటవీ సంపదను దోచుకెళ్లే విధంగా చట్టాన్ని రూపొందించుకొని అటవీ సంపదను దోచేసే క్రమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజనుల కు అండగా ఉండి గిరిజనుల హక్కులను సాధించేదుకు కృషి చేశారని, వారు చేసిన విప్లవం స్వాతంత్ర పోరాటానికి కూడా ఒక పెద్ద నాయకుడిగా, విప్లవ వీరుడిగా నిలిచి పోయిన గొప్ప వ్యక్తి అని కొనియాడాడు. మొదటి ప్రపంచ యుద్ధం జరిగే సమయంలో సముద్ర మార్గాన టేకు చెట్లను తీసుకెళ్లేందుకు కష్టంగా ఉన్న తరుణంలో ఎక్కడెక్కడ టేకు చెట్లు, అటవీ సంపదలు ఉన్నాయో ఆ ప్రాంతాలను గుర్తించి వాటిని యూరప్, పశ్చిమ దేశాలకు రోడ్డు ఇతరత్రా మార్గాలలో తరలించేందుకు బ్రిటిష్ వారి ప్రయత్నంలో భాగంగా మన రాష్ట్రంలో కొన్ని చోట్ల డిపోలలో ఏర్పాటుచేసి మొదటిగా అక్కడ డిపోలకు తరలించేందుకు కొంతమంది అధికారు లను నియమించి వారి ద్వారా ఆ డిపోలకు ఎక్కువ మొత్తంలో చెట్లను నరికి తరలించిన అధికారులకు పదోన్నతులు, జీతభత్యాలు పెంచడం తో అధికారులు పోటీపడి గిరి సంపదను దోచుకెళ్లే విధంగా బ్రిటిష్ వారు దోపిడీని మొదలుపెట్టారని, ఆ దోపిడీని అరికట్టేందుకు అల్లూరి సీతారామరాజు లాంటి వీరులు తయారవ్వడం జరిగిందని అన్నారు. గిరిజనులు కొండ ప్రాంతాలలో నివసించే వారిని , చెట్లు, అడవి సంపదను దైవంగా భావిస్తారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు గారు పార్వతీపురం నుండి రంపచోడవరం వరకు నడక దారిలో వారి సహచరులతో కలసి పల్లెలలో, గ్రామసభలను ఏర్పాటు చేసి వారి హక్కుల గురించి వారికి తెలియజేసి చైతన్యవంతులుగా తయారు చేసేందుకు కృషి చేశారని, వారు చేసిన పోరాట ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వాలు గిరిజనులకు వివిధ రకాల పథకాలను ఫలాలను అందిస్తున్నాయిని తెలిపారు.ప్రకృతి లో భాగంగా గిరిజనులు ఉంటారని అటవీ సంపద వారికే చెందే విధంగా చూడాలని ఈరోజు కి కూడా భారతదేశ ప్రభుత్వం ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ నందు గిరిజనులకు అనుకూలంగా రాయడం జరిగిందని ఈరోజుకి కూడా దానిని ప్రభుత్వం అనుసరిస్తున్నదని తెలిపారు. ఇవన్నీ కూడా అల్లూరి సీతారామరాజు గారు చేసిన కృషి ఫలితంగా ప్రభుత్వాల అమలు చేస్తున్నాయని అన్నారు. ఇది చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. మనందరం అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తితో వారి ఆదర్శ బాట నందు నడవాలని వెనుకబడిన కులాల వారికి తమ వంతు సహాయం సహకారం అందించాలని, తద్వారా సమాజంలో వారు మెరుగైన స్థితికి చేరుకునేలా కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్,డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏ ఓ అలెగ్జాండర్, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి: కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామవార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. రేషన్ కార్డు కోసం కావాల్సిన పత్రాలు గురించి శ్రీకాళ హస్తి సచివాలయ ఉద్యోగి మునీంద్ర మాట్లాడారు. ఆధార్ కార్డు, నివాసపత్రం, ఫొటోలు, అవసరమైనవారికి ఆదాయ పత్రం అవసరం అన్నారు. అర్హులు తగిన పత్రాలతో సచివాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి : జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్

**నంద్యాల, పెన్ పవర్ మే 07 :** స్వాతంత్ర సముపార్జన కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా డిఆర్ఓ వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రవికుమార్, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వాతంత్ర సముపార్జన కోసం అలుపెరగని పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. బ్రిటిషర్ల పాలనలో ప్రజలు అనుభవిస్తున్న దురాగతాలను తెలుసుకొని వాటిని అరికట్టడానికి అందరినీ ఏకీకృతం చేసి బ్రిటిషర్ల పైకి విప్లవాన్ని ప్రారంభించారన్నారు. ఈ విప్లవ పోరాటంలో ఎందరో విప్లవ యోధులు వారికి చేయుతగా నిలవడంతో బ్రిటిషర్లపై పలు దఫాలుగా దాడి చేశారని తెలిపారు. ఇదే సమయంలో సీతారామరాజు ఆచూకీ కోసం బ్రిటిష్ ప్రభుత్వం మన్యంలోని గిరిజనులను లెక్కలేని ఇబ్బందులకు గురిచేయడంతో తన వల్ల సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదని 1924వ సంవత్సరం మే నెల 7వ తేదీన మంప ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ సైనికులు బంధించారన్నారు అనంతరం కొయ్యూరు సైనిక శిబిరంలో మేజర్ గుడాల్ వారిని కాల్చి చంపడం జరిగిందన్నారు. 1922 నుండి 1924 వరకు రెండు సంవత్సరాల పాటు మన్యం ప్రాంతంలో అసమానమైన వీరునిగా దేశ స్వాతంత్రం కోసం తృణ ప్రాయంగా ప్రాణాలను విడిచిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. అల్లూరి సీతారామరాజు అలుపెరగని పోరాట స్ఫూర్తిని జీవితంలో అవలంబించుకొని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని డిఆర్ఓ సూచించారు.

## గ్రామీణ ప్రాంతాల్లో కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆంజనేయుడు గ్రామ సచివాలయంలో కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో రేణిగుంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మంజరి మాట్లాడుతూ అంగన్వాడి పరిధిలోని గ్రామంలోని కిషోర్ బాలికలను గుర్తించి వారికి పౌష్టికాహారం వ్యక్తిగత పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యం తదితర అంశాలపై కిషోర్ బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ వేసవికాలంలో కిషోర్ బాలికలకు సమయం వృధా చేసుకోకుండా ప్రభుత్వం వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ కిషోర్ బాలికలకు బాల్యవివాహాల వ్యతిరేకంగా అవగాహన మానవ అక్రమ రవాణా ఆత్మరక్షణ ఫోక్సు చట్టం సైబర్ నేరాలు భద్రతపై అవగాహన కల్పించారు ఆరోగ్య సిబ్బంది చార్టులపై వ్యక్తిగత పరిశుభ్రత ఇత్త వయసులో ఏర్పడే శారీరిక మార్పులు గురించి ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రగతి ఇబ్బంది మురుగయ్య వెంకటేష్ అంజిమేడు ఇసుక తాగేలి రామాపురం పోతుమానుగుంట అంగన్వాడి కేంద్రాల టీచర్లు స్వర్ణ హైమావతి బాలమున్నెమ్మ నిర్మల ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు కిషోర్ బాలికలు పాల్గొన్నారు అనంతరం కిషోర్ బాలికలు కిషోర్ వికాసంపై బ్యానర్లు చేతపట్టి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

## అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీల హక్కులకై కృషి చేయాలి



**కడప పెన్ పవర్ మే 7 :** అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిహార్ స్కిన్ డెవలప్మెంట్ సెంటర్ లో అల్లూరి చిత్రపటాని పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు ఆయన అసమాన సాహసం, త్యాగం, మరియు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గిరిజనులను సమీకరించి నడిపిన అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీల హక్కులకై ఉద్యమిద్ధమని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు గారి 101వ వర్ధంతి సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిహార్ స్కిన్ డెవలప్మెంట్ సెంటర్ లో ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా డి.ఎం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారు 1897 జూలై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారు. పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో పెరిగిన ఆయన, గిరిజనుల హక్కుల కోసం, 1882 మద్రాసు ఫారెస్ట్ ఆక్ట్ వల్ల వారి సంప్రదాయ వ్యవసాయం 'పోడు'పై జరిగిన ఆంక్షలను ఎదిరించి, సాయుధ పోరాటం నడిపారు. ఆయన నాయకత్వంలో మన్యం ప్రాంతంలో జరిగిన తిరుగుబాటు బ్రిటిష్ పాలనకు సింహస్వప్నంగా నిలిచింది. 1924 మే 7న బ్రిటిష్ పోలీసుల చేతిలో అమరుడైన ఆయన, తన 27 ఏళ్ల స్వల్ప జీవితంలో భారత స్వాతంత్ర్యోద్యమంలో చెరగని ముద్ర వేశారు. మైనింగ్ గ్రీన్ హంట్ రకరకాల పేర్లతో అడవి బిడ్డలను అడవల్నుంచి తరిమేస్తున్నారు. అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీల హక్కులకై ఉద్యమించడం ద్వారా బ్రిటిష్ వారి పై మన్యం తిరుగుబాటు జరిపి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యన్ని గడగడ లాడించిన అల్లూరికి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ, మైనారిటీ నాయకులు మహబూబ్ తార ఆర్ఎస్ఎఫ్ నాయకులు సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ న్యాయవాదుల సంఘం నుండి 'మెడల్ ఆఫ్ ఆనర్' అందుకున్న తొలి భారతీయ న్యాయవాదిగా భువన్ రిభు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 7 :** జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ప్రపంచంలోనే అతి పెద్ద న్యాయ సంబంధిత బాలల రక్షణ నెట్వర్క్, ఇది భారతదేశంలోని 416 జిల్లాల్లో ఎన్జీఓ భాగస్వాములతో పని చేస్తోంది. తిరుపతి జిల్లాను బాల్యవివాహం లేని జిల్లాగా మార్చే దిశగా ప్రగతి సంస్థ, భువన్ రిభు న్యాయపరమైన మరియు వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ముఖ్యంగా తిరుపతి జిల్లాలో భువన్ రిభు న్యాయపరమైన చొరవలు పలువురు గిరిజన మరియు బలహీన బాలలకు ఉపయోగపడే విధంగా రాష్ట్రస్థాయి విధానాలపై ప్రభావం చూపాయి.

ఈ అంతర్జాతీయ గుర్తింపు, తిరుపతి జిల్లాలో బాలల రక్షణ పనులకు ప్రోత్సాహాన్ని ఇచ్చే అంశంగా మారింది. 2030 నాటికి బాల్యవివాహం లేని తిరుపతిని సాధించాలన్న సంకల్పానికి ఇది పిలుపుగా నిలిచింది. జెఆర్సి వ్యవస్థాపకుడు మరియు ప్రముఖ బాలల హక్కుల న్యాయవాది భువన్ రిభు, డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన వరల్డ్ లా కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచ న్యాయవాదుల సంఘం నుండి 'మెడల్ ఆఫ్ ఆనర్' పొందిన మొదటి భారతీయ న్యాయవాదిగా నిలిచారు. ప్రగతి సంస్థ జెఆర్సియొక్క భాగస్వామిగా తిరుపతిలో పని చేస్తుండటంతో భువన్ రిభుకు ఆ ప్రాంతంతో ముడిపడి ఉన్న బలమైన సంబంధాలున్నాయి. ఈ గౌరవం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ మాట్లాడుతూ, "భువన్ రిభు జీకి ఈ గౌరవం లభించడం, వ్యక్తిగతంగా కాకుండా మాకు అందరికీ గర్వకారణం. రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా పాలనాధికారుల మద్దతుతో తిరుపతిని 2030 నాటికి బాల్యవివాహం లేని జిల్లాగా మార్చడానికి మా కృషి కొనసాగుతుంది.

## కబ్జా భూములను ప్రజా ప్రయోజనాలకే : నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు

### ధర్మవరం అభివృద్ధికి బీజేపీ కంకణబద్ధత

### మండల అభివృద్ధికి ప్రభుత్వ భూముల వినియోగం తప్పనిసరి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు




**ముదిగుబ్బ పెన్ పవర్ మే 07 :** రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాలకు మేరకు ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండల కేంద్రంలోని కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పర్యవేక్షించి మండల అధికారులతో, రెవెన్యూ అధికారులతో మాట్లాడి గత పాలకుల కాలంలో అక్రమంగా కబ్జాకు గురై భద్రత కోల్పోయిన ప్రభుత్వ భూములను న్యాయపూర్వకంగా తిరిగి స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. మండల అభివృద్ధి దృష్ట్యా ఈ భూములను ఉపయోగించాల్సిందిగా ఆయన అధికారులను కోరారు. ఆనంతరం, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన హరీష్ బాబు, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది కూడా వెంటనే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు అదేవిధంగా, త్రాగునీటి కోసం ఆసుపత్రిలో బోర్ అవసరమని వైద్య సిబ్బంది కోరిన నేపథ్యంలో, హరీష్ బాబు గారు వెంటనే ఎంపీడీవో గారితో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. దీనిపై ఎంపీడీవో గారు సానుకూలంగా స్పందించి, నాలుగు రోజులలోగా బోర్ పనులు పూర్తి చేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం ఎన్డీఏ కూటమి నాయకత్వంలో ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ఊతమిస్తాయని హరీష్ బాబు గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ బీజేపీ సీనియర్ నాయకులు మాలపాటి రామకృష్ణ, మండల బిజెపి అధ్యక్షులు అంజన్ రెడ్డి, గడ్డం ఓబిరెడ్డి, గంగాధర్ రెడ్డి, దాము, ధర్మవరం పోతుకుంట రాజు, సుబ్బారావు పేట పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కల్పవృక్ష, హనుమ వాహనాలలో ఊరేగిన చెన్నకేశవుడు



**ధర్మవరం పెన్ పవర్ మే 7 :** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు 4వ రోజు దాతలు, భక్తాదులు, ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమ వాహనం నకు అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు ,చక్రధర్ లు వేదమంత్రాలు ,మంగళ వాయిద్యాలయం ప్రత్యేక అర్చనలు, పూజలు చక్కటి అలంకరణ గావించారు. వాహనానికి ఉభయ దాతలుగా పూక సత్యనారాయణ అండ్ సన్స్, బండారు శ్రీనివాసులు, దాసరి నిరంజన్ కుమార్ యాదవ్ అండ్ సన్స్, గాండ్ల రామాంజనేయులు అండ్ సన్స్, దాశెట్టి నారాయణస్వామి అండ్ సన్స్, లక్ష్మీ నరసమ్మ, జిల్లా చిన్న రామయ్య కుటుంబ సభ్యులు, రాచర్ల మునయ్య వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. సాయంత్రం హనుమ వాహనం కు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉభయ దాతలుగా బండి వేణుగోపాల్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.అనంతరం వీరి పేరిటన ప్రత్యేక పూజలు చేసి, వారిని చైర్మన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. తదుపరి పట్టణ పురవీధుల గుండా ప్రత్యేకమైన వాహనంలో స్వామివారు ప్రజల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలతో పాటు పట్టణ పుర ప్రముఖులు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల కార్మిక నిర్మూలనకై ఆకస్మిక తనిఖీలు






**కర్నూలు పెన్ పవర్ మే 7 :** కర్నూలు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. కబర్థి,కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ లేబర్ ఆఫీసర్ సాంబశివరావు, ఐ సి డి ఎస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల గారు,కర్నూలు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీస్ డిసిబి సెక్రటరీ నాగరాజు గారు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం, బాల కార్మికులను గుర్తించడానికి ప్రత్యక్షంగా కదం కదిపారు. సంబంధిత శాఖ అధికారులు, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, జాతీయ బాల శ్రమ ప్రాజెక్ట్, కర్నూలు, జిల్లా ప్రొబేషనరీ అధికారి, కౌన్సెలర్, సివిల్ సొసైటీ వారు, పోలీసు, జువెనైల్ సంక్షేమం మొదలైన అధికారుల సహకారంతో కర్నూలు పట్టణంలో బృందంగా వెళ్ళి పాతబస్టాండ్, రాజ్ విహార్, పెద్ద మార్కెట్, ఆనంద్ థియేటర్, భూపాల్ కాంప్లెక్స్ మొదలగు ఏరియాలలో, షాప్స్ లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఐదు మంది బాల కార్మికులను గుర్తించి వారికి వల్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాడానికి సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని చెప్పారు. ఎవ్వరికైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా షాప్స్ నందు బాల కార్మికులు కనిపిస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు తెలుపవలసినదిగా కోరుచున్నామని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో సంబందిత శాఖల వారందరూ పాల్గొన్నారు.

## శ్రీ కపిలేశ్వరాలయంలో పత్ర పుష్పయాగం

**తిరుపతి పెన్ పవర్ మే 7 :** తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో మే 12వ తేదీన పత్ర పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందుకోసం మే 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ జరుగనుంది. మే 12న ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారు, శ్రీ కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు, చందనంలతో అభిషేకం చేస్తారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగ మహోత్సవం చేపట్టనున్నారు. లోక క్షేమం కొరకు, ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు.

## అసంఘటిత కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు




**కడప పెన్ పవర్ మే 7 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ డాక్టర్ సి.యామిని, ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాల సందర్భంగా కడప నగరం రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ నందు, రవీంద్ర నగర్ మెయిన్ రోడ్డు నందు, పాత బస్టాండ్ ఫ్రూట్ బజార్ నందు అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి–యజమాని సమస్యలు, ఈ–శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి, అసంఘటిత కార్మికుల/వ్యవసాయ కార్మికుల యొక్క సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రవితేజ మరియు ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య మరియు అసంఘటిత కార్మికులకు పాల్గొన్నారు.

## అల్లూరి విప్లవ జ్యోతి : డాక్టర్ తులసి రెడ్డి



**కడప పెన్ పవర్ మే 7 :** భారత స్వాతంత్ర్య సంగ్రామం లో తెలుగు ప్రజలు గర్వించ దగ్గ విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు.

స్వర్గీయ అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లి లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మన్యం ప్రజల విముక్తి కోసం,వారి ఆర్థిక,సాంఘిక సముద్ధరణ కోసం తన సుఖాలను త్యాగం చేసి ఆత్మ బలి దానం చేసిన అమరజీవి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,నాగరాజు, రమణ, వినయ్, తదితరులు పాల్గొన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత,గీతాంజలి రచయిత,స్వర్గీయ రవీంద్ర నాథ్ ఠాగూర్ విశ్వ కవీంద్రుడు,సాహితీ సార్వ భౌముడు ,కళామ తల్లి ముద్దు బిడ్డ అని తులసి రెడ్డి శ్లాఘించారు. రవీంద్ర నాథ్ ఠాగూర్ 164 వ జయంతి నీ వేంపల్లి లో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రవీంద్రుడు వ్రాసిన జాతీయ గీతం జనగణమన జాతీయ స్ఫూర్తికి,దేశ భక్తికి ప్రతీక అన్నారు. తన సాహితీ విలువలతో భారత దేశానికి ప్రపంచం లోనే సమున్నత స్థానం కల్పించారు. ఆయన స్థాపించిన శాంతి నికేతన్ ఆదర్శ గురుకుల విద్యాలయమన్నారు.స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ శాంతి నికేతన్ విద్యార్థి అని తులసి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగ రాజు,రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.అల్లూరి విప్లవ జ్యోతి.. తులసి రెడ్డి. భారత స్వాతంత్ర్య సంగ్రామం లో తెలుగు ప్రజలు గర్వించ దగ్గ విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు. స్వర్గీయ అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లి లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మన్యం ప్రజల విముక్తి కోసం,వారి ఆర్థిక,సాంఘిక సముద్ధరణ కోసం తన సుఖాలను త్యాగం చేసి ఆత్మ బలి దానం చేసిన అమరజీవి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్,నాగరాజు, రమణ, వినయ్, తదితరులు పాల్గొన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత,గీతాంజలి రచయిత,స్వర్గీయ రవీంద్ర నాథ్ ఠాగూర్ విశ్వ కవీంద్రుడు,సాహితీ సార్వ భౌముడు ,కళామ తల్లి ముద్దు బిడ్డ అని తులసి రెడ్డి శ్లాఘించారు. రవీంద్ర నాథ్ ఠాగూర్ 164 వ జయంతి నీ వేంపల్లి లో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రవీంద్రుడు వ్రాసిన జాతీయ గీతం జనగణమన జాతీయ స్ఫూర్తికి,దేశ భక్తికి ప్రతీక అన్నారు. తన సాహితీ విలువలతో భారత దేశానికి ప్రపంచం లోనే సమున్నత స్థానం కల్పించారు. ఆయన స్థాపించిన శాంతి నికేతన్ ఆదర్శ గురుకుల విద్యాలయమన్నారు. స్వర్గీయ ఇందిరా గాంధీ శాంతి నికేతన్ విద్యార్థి అని తులసి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగ రాజు, రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి బాధ్యతాయుతంగా పనిచేయాలి : జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 06 :** రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి బాధ్యతాయుతంగా పనిచేయాలి : జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, రెవెన్యూ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రెవెన్యూ అధికారు లతో సమావేశమై రెవెన్యూ సదస్సు లు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం)లో వచ్చిన అర్జీల పరిష్కారం, జిల్లాలో వివిధ ప్రాజెక్ట్సుకు సంబంధించిన భూ కేటాయింపుల ప్రతిపాదనలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారిక వేదికలో ఎక్కువగా రెవెన్యూ సమస్యల పైనే అర్జీలు వస్తున్నాయని, వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యను అర్థం చేసుకొని అనాలసిస్ చేసి నాణ్యతతో పరిష్కరించాలన్నారు.

జిల్లాలో గతం లో నిర్వహించిన రెవిన్యూ సదస్సులు మరియు పి జి ఆర్ ఎస్ లో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై క్షేత్ర స్థాయి ఆడిట్ ను సక్రమంగా నిర్వహించాలన్నారు. అర్జీల పరిష్కారం లో భాగంగా క్షేత్ర స్థాయి లో ఎండార్స్మెంట్ వేసిన వాటిని పరిష్కారం చూపిన విధానం సక్రమంగా ఉందా లేదని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలన్నారు.

# 76 సెంటర్లలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు : జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య





**కర్నూలు, పెన్ పవర్ మే 07 :** మే12 వ తేది నుండి 20వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను76 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మే12 వ తేది నుండి 20 వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను76 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. మొదటి సంవత్సరం నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 15501 మంది జనరల్ విద్యార్థులు, 791 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం 16292 మంది విద్యార్థులు 52 సెంటర్లలో పరీక్షలు వ్రాస్తున్నారని,2 వ సంవత్సరానికి సంబంధించి 4437 మంది జనరల్ విద్యార్థులు, 595 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం రెండో సంవత్సరానికి 5032 అంది విద్యార్థులు 24 సెంటర్లలో పరీక్షలు వ్రాస్తున్నారన్నారు, ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రశ్న పత్రాలను ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లో భద్రపరచడం జరిగిందని, ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాల వద్దకు ఎస్కార్ట్తో తీసుకొని వెళ్లాలని, ఉదయం పరీక్షల నిర్వహణ అనంతరం ఎస్కార్ట్తో పోస్ట్ ఆఫీస్ వద్దకు తీసుకొని వెళ్లి పోస్టల్ ద్వారా పంపించవలసి ఉంటుందన్నారు, సాయంకాలం నిర్వహించిన పరీక్ష పత్రాలను పోలీస్ స్టేషన్ల నందు భద్రపరిచి మరుసటి దినము ఆ పరీక్ష పత్రాలను పోస్ట్ ఆఫీస్ కు ఎస్కార్ట్ తో తీసుకువెళ్లాలని, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారుల ను ఆదేశించారు. మున్సిపాలిటీ వారు పరిష కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం కల్పించాలని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని జాయింట్ కలెక్టర్ మున్సిపాలిటీ వారిని ఆదేశించారు. జిల్లా పంచాయతీ వారు. రూరల్ ప్రాంతంలో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు త్రాగునీటి సదుపాయం కల్పించాలని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలను శుభ్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డిపిఓ కార్యాలయం సిబ్బందిని ఆదేశించారు. విద్యాశాఖ వారు పరీక్షల సమయంలో ఆర్ఐఓ సమన్వయంతో ఇన్విజిలేటర్స్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెవిన్యూ డిపార్ట్మెంట్ వారు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలని, పరీక్ష కేంద్రాల నిర్వహణలో ఫ్లేయింగ్ స్క్వాడ్ నందు ఇద్దరు రెవిన్యూ అధికారులు ఉండేలా చూడాలని అన్నారు. లేబర్ డిపార్ట్మెంట్ వారు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్ లను క్లోజ్ చేయించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ వారు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తగినన్ని బస్సులు ఆ రూట్లో తిరిగేలా చూడాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ వారు పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ ఎస్ ఎస్ ప్యాకెట్లు,ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకొని ఆశా వర్కర్లను కూడా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోస్టల్ డిపార్ట్మెంట్ పరీక్ష కేంద్రాల నుండి వచ్చినటువంటి పత్రాలను జాగ్రత్తగా పోస్ట్ చేసేలా చూడాలన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ వారు పరీక్ష కేంద్రాలలో విద్యుత్ అంతరాయం కలవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డివిఈవో, ఆర్ఐవో సమన్వయంతో పరీక్షలు విజయ వంతంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షలను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఓ గురువయ్య శెట్టి, డివిఈఓ సురేష్ బాబు, జడ్పీ సీఈవో నాసరా రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతి కల, ఏపీ ఎస్పీడీసీఎల్, లేబర్ డిపార్ట్మెంట్, ఏపీఎస్ఆర్టీసీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించండి

### సివిల్ మాక్ డ్రిల్ లో భాగంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**కడప, పెన్ పవర్ మే 7 :** దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా.. జిల్లాలో ముందస్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసర సేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్ డ్రిల్ అంశంపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు.

ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రత్యేకించి జిల్లాలోని జీజీహెచ్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులను, అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న విద్యుత్, ఇంధన, అణు ఉత్పాదక సంస్థలు, కర్మాగారాలైన ఆర్టిపిపి, పవర్ గ్రిడ్, ఐఒసీఎల్, హెచ్పిసీఎల్, యూసీఐఎల్ తదితర సంస్థల్లో ఖచ్చితంగా పౌర భద్రతా ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని జిలా కలెక్టర్ ఆదేశించారు.

మాక్ డ్రిల్ నిర్వహించిన అనంతరం సంబందిత రిపోర్ధులను కలెక్టరేట్ కు అందజేయలన్నారు. అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లో ని సంబంధిత అధికారులతో కలసి పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అందులో భాగంగా చేపట్టే రిహార్సల్స్, మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్కు జిల్లా పోలీసు శాఖ కార్యాలయం నుండి ఎస్పీ అశోక్ కుమార్, కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితిసింగ్, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు

# జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకూడదు

### డ్వామా అనుబంధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ మే 7 :** వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ కాల పనుల పురోగతిపై జేసీ అదితిసింగ్ తో కలిసి... జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి డ్వామా, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవి సీజన్ లో జిల్లాలో ఎక్కడా నీటికొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జీవాలకు ఎలాంటి తాగునీటికొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా.. సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా.. ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధానంగా ఎంపిడివోలు, ఏపీవోలు వారు పనిచేసే మండలాల్లోనే నివాసం ఉంటూ.. ఉద్యోగ విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రాధాన్యత మేరకు... నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 60 వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఉద్యాన శాఖ అధికారులు, ఏపీఎంఐపి, పీఆర్ అధికారుల సమన్వయంతో ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. అలాగే వచ్చే ఏడాదిలోపు లక్ష ఎకరాలను సాగుబడిలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో లేబర్ కంపోనెంట్ ను పెంచాలన్నారు. అవసరం ఉన్న ప్రాధాన్య పనులకు ఉపాధి కూలీలను సద్వినియోగం చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకోసం.. అనుబంధశాఖలన్నీ అభివృద్ధి కమిటీగా ఏర్పడి.. లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. రానున్న మూడు నెలల్లో.. ఎంపిక చేసిన 100 గ్రామాల్లో మొత్తం పచ్చదనంతో నింపాలన్నారు. వ్యవసాయ సాగుతో పాటు... 60% పైగా ఉద్యనసాగును, మిగిలిన సూక్ష్మ శాతాన్ని పశు సంపదతో పునరుజ్జీవ కల్పన సాధించాలన్నారు. సంవర్థక వైపు మళ్లించేందుకు.. సుస్థిరమయిన వనరులను సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతేకాకుండా.. వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఎస్సి కార్పొరేషన్ సంస్థ మొదలైన అన్ని అనుబంధ శాఖలు వారి పరిధిలో నిర్వహించాల్సిన బాధ్యతలను సకాలంలో నిర్వహిస్తూ.. జిల్లాకు కేటాయించిన లక్ష్యం సాధనకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, రైతులను భాగస్వామ్యం చేసుకుంటూ.. గ్రామసభలు నిర్వహించాలన్నారు. అందులో రైతులు ఆసక్తి చూపే ఉద్యాన పంట రకాలు, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు.. అన్న వివరాలను సేకరించి.. జిల్లాలో ఉద్యాన సాగుబడికి పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి చేసే దిశగా.. ఆయా ప్రాంతాల్లో వనరుల ఆధారంగా ప్రకృతి వ్యవసాయం, అనుబంధ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపేలా వారిలో అవగాహన పెంపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి అదిశేషారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. ఏడుకొండలు, పీఆర్ ఎస్.ఈ. శ్రీనివాసులు రెడ్డి, ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, పశు సంవర్ధక శాఖ జెడి డా. శారదమ్మ డ్వామా ఎపిడీలు, ఏపివోలు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్తీ ఆబా జంజతీయ గ్రామ్.. ద్వారా స్థిరమైన అభివృద్ధి





**చిత్తూరు, పెన్ పవర్ మే 07 :** ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజన గ్రామాన్ని సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధి సాధించడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నందు జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎస్.మూర్తి తో కలసి ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం, జగమర్ల గిరిజన గ్రామాన్ని సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. దేశంలో ఎక్కువుగా ఉన్న 63, 243 గిరిజన గ్రామాలను గుర్తించి గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో

2024 అక్టోబర్ 02 న ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అందులో చిత్తూరు జిల్లాలో పలమనేరు మండలం జగమర్ల ఎస్టీ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. (194 కుటుంబాలు,659 మంది ఉంటే అందులో 110 గిరిజన కుటుంబాలు 418 మంది వున్నారు ) ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం గిరిజన గ్రామంలో సామాజిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య మరియు జీవనోపాధిలో కీలకమైన అంశాలను గుర్తించి వీటి ద్వారా గిరిజన గ్రామం సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధి సాధించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలు గిరిజనలకు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డి ఆర్డీఏ,విద్యా, వైద్యం,స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, జిల్లా పంచాయతీ అధికారి,వ్యవసాయ అనుబందశాఖలు,విద్యుత్, టెలికమ్యూనికేషన్స్, నైపుణ్య అభివృద్ధి,ఉపాధి శాఖల అధికారు జగమర్ల గిరిజన కాలనీకి వెళ్లి పరిశీలించాలన్నారు. వీటికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ అధికారి 144 అంశాలకు సంబంధించిన పార్మెట్ అందజేయడం జరుగుతుందని అందులో మీ శాఖ సంబంధించిన వివరాలను నింపి అందజేయాలన్నారు. సంబంధిత శాఖలు అందజేసిన వివరాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ గారు ప్రతినెల జిల్లా స్థాయి కమిటీలు చర్చించడం జరుగుతుందని తెలిపారు. శాఖలవారు అందజేసిన సమాచారాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పలమనేరు మండల స్థాయిలో కూడా మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి వెంకటేశ్వరి,జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ,గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈ ఈ.పి.వి.నరేంద్ర, ఎస్ ఎస్ ఏ పిఓ.యం. వెంకటరమణ, విద్యుత్ శాఖ డీఈ చిన్నప్ప,పంచాయతీ రాజ్ డి ఈ అనిత, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వేడుకగా శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు**











# అమరావతిలో జోరుగా రియల్ వ్యాపారం



**విజయవాడ, మే 7, పెన్ పవర్:** అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం చేశారు మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబు పై తనకు నమ్మకం ఉందని.. ఆయన చేసి తీరుతారని ప్రధాని ప్రకటించారు. దీంతో అమరావతికి కొత్త ఊపిరి వచ్చినట్లు అయింది. అయితే అమరావతి రాజధాని కాకుండా.. సమాన స్థాయిలో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఊపందుకోవడం విశేషం. అమరావతి ప్రాంతంలో ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ హడావిడి కనిపిస్తోంది. మూతపడిన ఆఫీసులు తెరుచుకుంటున్నాయి. లేఅవుట్ సరిహద్దు రాళ్లకు రంగులు పడుతున్నాయి. లేఅవుట్లలో కొత్తగా ఫ్లెక్సీలు, జెండాలు కడుతున్నారు. వాటి విక్రయాల కోసం మార్కెటింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు.2014లో రాష్ట్ర విభజన జరిగింది. తెలంగాణ విభజిత రాష్ట్రం కాగా.. ఏపీ నవ్యాంధ్రప్రదేశ్ గా మారింది. అటువంటి సమయంలో అందరి అభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 33 వేల ఎకరాల భూమిని రైతుల స్వచ్ఛందంగా అమరావతి రాజధాని కోసం ఇచ్చారు. అది మొదలు తెలంగాణలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి వైపు చూడడం ప్రారంభించారు. ఆంధ్రుల రాజధాని అమరావతి ప్రపంచ దేశాల్లో భావి నగరంగా మారుతుందని ఆశించారు. అందుకే పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటాయి. కానీ 2019లో అధికారం చేతులు మారడం.. అమరావతి రాజధాని నిర్వీర్యం కావడం.. మూడు రాజధానులు తెరపైకి రావడం చకచకా జరిగిపోయాయి. అప్పటివరకు జెట్ స్పీడ్ తో వెళ్లిన రియల్ ఎస్టేట్ వ్యాపారం అమాంతం పడిపోయింది. గత ఐదేళ్లలో ఆ రంగం పై ఆధారపడిన వ్యాపారులు, ఉద్యోగులు వీధిన పడిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారం పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమన్నారు. కానీ ఎట్టకేలకు టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి కొత్త కళ వచ్చింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి.ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది. అమరావతిలో పొలాలను ఎక్కడా కొనే పరిస్థితిలో లేదు. కోర్ క్యాపిటల్ పరిధిలో పొలాలు కొనగలిగే రేంజ్ లో కూడా ధరలు లేవు. అమరావతి చుట్టుపక్కల, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ కూడా పొలాలు కొనుగోలు చేయడానికి ధర అందుబాటులో లేదు. ప్రస్తుతం ఒక అమరావతి ప్రాంతంలోనే కాకుండా.. గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తెనాలి, బాపట్ల వరకు ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులు అక్కడ కొనుగోలు చేసే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.గత అనుభవాల దృష్ట్యా అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పై పెట్టుబడి పెట్టే వారు మాత్రం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గతం మాదిరిగా దూకుడుగా అడుగు వేసే పరిస్థితి లేదు. పెట్టుబడి పెట్టాలనుకునే వాళ్లు కొద్ది రోజులు ఆగుదాం అని ఆలోచిస్తున్నారు. మరికొందరు అయితే కేంద్ర ప్రభుత్వం సహాయం, రాష్ట్ర ప్రభుత్వం దూకుడు, పార్లమెంట్లో ప్రత్యేక చట్టం వంటి వాటిని దృష్టిలో పెట్టుకొని భూముల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఒకటి మాత్రం నిజం. గతంతో పోల్చుకుంటే కొనుగోలు సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఈ విషయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సైతం ధ్రువీకరిస్తోంది. మొత్తానికైతే అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. కానీ గత మాదిరిగా దూకుడుగా వెళ్లడం లేదు.

# గిరిజన జాతరకు భారీగా నిధులు

**విజయనగరం,మే 7,పెన్ పవర్:**మన్యం దేవతగా గిరిజనుల దేవతగా పూజలందుకుంటున్న మోదకొండమ్మకు ప్రతి సంవత్సరం మే నెలలో జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది మే 11 నుంచి మూడు రోజుల పాటు జాతర చేయనున్నారు. ఈ మేరకు ఉత్సవ, ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత దీనిని రాష్ట్ర గిరిజన జాతరగా ప్రకటించారు. మొదటి రెండేళ్లు ఏడాదికి 50 లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత ఆ లెక్కను కోటికిపెంచారు.మోదకొండమ్మ జాతర ఏటా మే నెలలో రెండో వారంలో నిర్వహించడం ఆనవాయితీ. విశాఖ పట్టణానికి 120 కిలోమీటర్ల దూరంలో పాడేరులో స్వయంభువుగా వెలసింది అమ్మవారు. మోదం అంటే సంతోషం అని అర్థం. గిరుల్లో వెలసిన దేవత కాబట్టి కొండమ్మ అని కలసి...మోదకొండమ్మ అని పూజలందిస్తున్నారు భక్తులు. ఒడిశా కోరాపుట్ జిల్లాలో నందపురం అనే ప్రాంతం కళింగ దేశంలో ఓ రాజ్యంగా ఉండేది. ఆ నందపురాన్ని రాణి మాకలశక్తి, భైరవుడు పాలించేవారు. వీరికి ఏడుగురు కుమార్తెలు, ఓ కొడుకు. వారిలో మొదటి సంతానమే మోదకొండమ్మ. చిన్నప్పటి నుంచీ మహిమలు చూపే మోదకొండమ్మ మహిషాసుర సంహారం సమయంలో ఆదిపరాశక్తికి సహాయపడిందని పురాణాలు చెబుతున్నాయి. మోదకొండమ్మ మేనత్తకు ఏడుగురు కుమారులు ఉండేవారట. దేశిరాజులుగా పిలిచే ఆ ఏడుగురిని మోదకొండమ్మ అక్కచెల్లెళ్లు ఏడుగురు వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత పాడేరులో పినవేనం అనే రాతి గుహ వద్ద స్వయంభువుగా కొలువుదీరిందనీ...మోదకొండమ్మ చెల్లెళ్లు కూడా వివిధ ప్రాంతాల్లో

వెలిశారని కథనం. కొన్నాళ్లక్రితం ఇక్కడ ఏటా ప్రత్యేక పూజలు చేసేవారు. ఓసారి పూజల అనంతరం అంతా వెళ్లిపోయాక మోదకొండమ్మ తన చెల్లెళ్లతో కలసి విందు ఆరగిస్తోందిట. ఆ సమయంలో పూజారి వెనక్కు వెళ్లాడు. అంతదూరం తిరిగి వచ్చిన పూజారిని చూసి మోదకొండమ్మ...తన దర్శనం కోసం ఇంత దూరం ఎవరూ రావొద్దని చెప్పి...ఈ చెంబు పడేచోట తాను కొలువై ఉంటాయనని విసిరిందట. ఆ చెంబు పడిన చోట అమ్మవారి పాదాలు కనిపించడంతో వాటినే ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు భక్తులు.ఆ తర్వాత కాలంలో తహసిల్దార్ దాసరిశర్మ అనే భక్తుడి కలలో అమ్మవారు కనిపించడంతో పాడేరులో ఆలయం నిర్మించారని కథనం.ఏడాది మొత్తం విశేష పూజలు నిర్వహించి ఏడాదికోసారి మే నెలలో మూడు రోజుల పాటు వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా భారీగా తరలివస్తారు. మొదటి రెండు రోజులూ స్థానిక సతకంపట్టు వద్ద అమ్మవారి ఘటాలను మేళతాళాలతో తీసుకొచ్చి పెడతారు. వాటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు భక్తులు. సాయంత్రం ఆ ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. మూడో రోజు తెల్లవారుజామునుంచే మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. విశేషమైన పూజలు, ఊరేగింపులతో ఉత్సవాలు ముగుస్తాయి. విశాఖ వరకూ ట్రైన్ లేదా బస్సులో చేరుకుంటే అక్కడి నుంచి మోదకొండమ్మ ఆలయానికి బస్సులు, ప్రేవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి.జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో ఏర్పాట్ల ఖర్చు కూడా పెరుగుతోంది అంటున్నారు నిర్వాహకులు. అందుకే ప్రభుత్వం ఇస్తున్న కోటి రూపాయల నిధులను మూడు కోట్లకు పెంచాలని స్థానిక అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

# జూన్ 1 నుంచి విమాన సేవలు




**విశాఖపట్టణం, మే 7,పెన్ పవర్:**ఏపీకి రాజధానిగా అమరావతి ఉంది. అమరావతి పునర్నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మరోవైపు విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందులో భాగంగా దిగ్గజ పారిశ్రామిక సంస్థలు విశాఖలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. ఈ తరుణంలో విజయవాడ నుంచి విశాఖకు రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి. రోడ్డు మార్గంలో వెళ్లాలంటే సమయం పడుతుంది. రైలు మార్గంలో కూడా జాప్యం జరుగుతోంది. మరోవైపు విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత కొద్దిరోజులుగా దీనిపై విమర్శలు వస్తుండడంతో కేంద్ర పౌర విమానయాన శాఖ దృష్టి పెట్టింది. రెండు నగరాలను కలుపుతూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు.విజయవాడ నుంచి విశాఖకు వెళ్లాలంటే.. చెన్నై నుంచి వచ్చే ఒకే విమానం అందుబాటులో ఉంది. అందుకే దానికి విపరీతమైన రద్దీ ఉంటుంది. దీంతో చాలామంది హైదరాబాద్ కు వెళ్లి.. అక్కడి నుంచి విశాఖకు చేరుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమాన సర్వీసులపై ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సైతం దీనిపై ఆవేదన వ్యక్తం చేశారు. పౌర విమానయాన సర్వీసులపై విమర్శలు రావడంతో సంబంధిత శాఖ దృష్టి పెట్టింది. విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. ఈ నిర్ణయం పై విమాన ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కొత్త విమాన సర్వీసులపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకీలక ప్రకటన చేశారు. జూన్ 1 నుంచి కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఈ విమానం ఉదయం ఏడు గంటల 15 నిమిషాలకు విజయవాడలో బయలుదేరుతుంది. ఎనిమిది గంటల 25 నిమిషాలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి ఉదయం 8 గంటల 45 నిమిషాలకు విశాఖ నుంచి బయలుదేరుతుంది. 9 గంటల 45 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ నూతన విమాన సర్వీసు తో విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులకు కొంతవరకు రవాణా భారం తగ్గనుంది.ఇప్పటివరకు చెన్నై నుంచి విశాఖ వెళ్లే విమాన సర్వీస్ మాత్రమే అందుబాటులో ఉండేది. చెన్నై నుంచి ఉదయం ఎనిమిది గంటల ఐదు నిమిషాలకు విజయవాడ వచ్చే ఈ విమానం.. 8 గంటల 45 నిమిషాలకు విశాఖ బయలుదేరేది. కానీ చెన్నై నుంచి విమానంలో రద్దీ ఎక్కువగా ఉండేది. దీంతో ఎక్కువమంది హైదరాబాద్ మీదుగా విశాఖకు చేరుకునేవారు. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి. విజయవాడ నుంచి ఉదయం విశాఖ కు వెళ్లి.. పనులు చూసుకుని రాత్రికి అందుబాటులో ఉండే విమానాల్లో తిరిగి విజయవాడకు చేరుకోవచ్చని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పౌర విమానయాన శాఖ నిర్ణయం పై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ లో ఒక పోస్ట్ పెట్టారు.

# మళ్లీ అమల్లోకి బేబి కిట్

**ఏలూరు, మే 7,పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం మరో పథకాన్ని పునరుద్ధరించింది. బేబీ కిట్ పథకాన్ని మళ్లీ అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ పథకం ద్వారా నవజాత శిశువులకు మేలు జరగనుంది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించింది. ఈ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు, నవజాత శిశువుల సంరక్షణ కోసం ఉచితంగా కిట్ ఇస్తారు. 2014-2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని "ఎన్టీఆర్ బేబీ కిట్" పేరుతో అమలు చేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఈ పథకాన్ని అపేసింది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించిందనవజాత శిశువులకు అవసరమైన ప్రాథమిక వస్తువులను అందించడం ద్వారా.. వారి ఆరోగ్యాన్ని, పరిశుభ్రతను కాపాడటం, శిశు మరణాలను తగ్గించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఆర్థికంగా కూడా సహాయపడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలందరూ ఈ పథకానికి అర్హులు. ఈ కిట్‌లో సుమారు రూ. 1000 నుండి రూ. 2000 విలువ చేసే వస్తువులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ఏయే వస్తువులు ఉంటాయి..

బేబీ బెడ్ కమ్ క్యారియర్ (దోమతెరతో సహా)

వాటర్ ప్రూఫ్ కాట్ షీట్,,బేబీ డ్రెస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, బేబీ పౌడర్ఎ బేబీ షాంపూ

బేబీ ఆయిల్, బేబీ సబ్బు, సోప్ బాక్స్, శానిటైజర్, కొన్ని రకాల క్రీములు, బేబీ రాటిల్ టాయ్

వివరాలు సేకరించి.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన వెంటనే బాలింతలకు ఈ కిట్‌లను అందజేస్తారు. గతంలో అమల్లో ఉన్న ఈ పథకం కొంతకాలం నిలిచిపోగా.. జిల్లాల వారీగా ప్రసవాల వివరాలు సేకరించి మళ్లీ పునరుద్ధరించారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ఇలాంటి పథకాలను కూడా అధికారులు పరిశీలించారు.పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుంది.నవజాత శిశువులకు అవసరమైన ప్రాథమిక వస్తువులు అందుబాటులో ఉంటాయి.శిశువులకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.శిశు మరణాల రేటును తగ్గించడంలో సహాయపడుతుంది.

# ఏడేళ్ల తర్వాత డీఎస్సీ

**విజయవాడ,మే 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 16 వేలకు పైగా ఉపాధ్యాయ కొలువుల భర్తీకి గత నెలలో మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ త్వరలోనే ముగియనుంది. మే 15వ తేదీతో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. మరోవైపు జూన్ 6 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వెలువడిన అతి పెద్ద డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇదే కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు పోస్టులకు పోటీపడనున్నారు. మొత్తం 16,347 పోస్టులను ఈ నోటిఫికేషన్ కింద భర్తీ చేయనున్నారు. 1994 నుంచి 2018 వరకు తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో స్పెషల్, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్లతో కలిపి మొత్తం 13 డీఎస్సీల ద్వారా ఏకంగా 1.8 లక్షల మంది ఉపాధ్యాయుల నియామకాలను పూర్తి చేశారు.ఏపీలో చివరిగా 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువడక పోవడంతో దాదాపు ఏడేళ్లుగా అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం పడిగాపులు కాశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించేందుకు గతేడాది అక్టోబరులో టెట్ కూడా నిర్వహించింది. ఇక 2024 నవంబరులోనే డీఎస్సీ సిలబస్ కూడా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే డీఎస్సీ ప్రకటన జారీ చేయవల్సి ఉండగా.. ఎస్సీ ఉపవర్గీకరణ అమలు నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం నెలకొంది. ఎస్సీ వర్గీకరణ గత నెలలో పూర్తి కావడంతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అలాగే స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచడమే కాకుండా 421 పోస్టులకు తాజాగా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.మొత్తం పోస్టుల్లో జిల్లా స్థాయిలో 14,088 పోస్టులు, రాష్ట్ర, జోనల్ స్థాయిలో 2,259 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తులు, పురపాలక, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జువెనైల్ సంక్షేమ పాఠశాలల్లోని ఖాళీలకు జిల్లా స్థాయిలో నియామకాలు చేపట్టనున్నారు. అన్ని రకాల ఎస్జీటీ పోస్టులు 6,599 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7,487 పోస్టులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 14,088 పోస్టులు ఉన్నాయి. ఇక రాష్ట్ర స్థాయి పోస్టులు 259 ఉన్నాయి. జోన్ 1లో 400, జోన్ 2లో 348, జోన్ 3లో 570, జోన్ 4లో 682 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తు, పురపాలక పాఠశాలల్లో మొత్తం 13,192 ఖాళీలు ఉన్నాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 881, జువెనైల్ పాఠశాలల్లో 15, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే బధిరులు, అంధుల పాఠశాలల్లో 31 పోస్టులు ఉన్నాయి.

# బీజేపీ, జనసేనలతో కూటమా...

**విజయవాడ, మే 7, పెన్ పవర్::** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు బీజేపీ కేంద్ర నాయకత్వం పెద్ద బాధ్యతలను అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. జనసేనలో ఉన్నప్పటికీ బీజేపీ పెద్దలు పవన్ పై ఎన్నో ఆశలు పెంచుకున్నారు. ముఖ్యంగా దక్షిణాదిన పవన్ కల్యాణ్ ను వచ్చే ఎన్నికల నాటికి ఉపయోగించుకోవాలని కేంద్ర నాయకత్వం భావిస్తుంది. దక్షిణాదిన బీజేపీకి సరైన ఇమేజ్ ఉన్న నేతలు లేరు. కర్ణాటకలో యడ్యూరప్ప మొన్నటి వరకూ ఉన్నా ఆయన రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకున్నారు. ఇక కర్ణాటకలో బీజేపీకి సరైన నేత లేరు. తమిళనాడు లోనూ బీజేపీని గెలిపించగల లీడర్ అంటూ కరువయ్యారు. కేరళ రాష్ట్రంలోనూ అదే పరిస్థితి. తెలంగాణలో నేతలు బలంగా ఉన్నప్పటికీ ఇమేజ్ ఉన్న నాయకుడు లేరు. ఆంధ్రప్రదేశ్ లోనూ సరైన నాయకత్వం లేదు. క్రౌడ్ పుల్లర్ లీడర్... అయితే దక్షిణాది రాష్ట్రంలో క్రౌడ్ పుల్లర్ గా ఒక నేత కావాలని బీజేపీ భావిస్తుంది. అందుకు పవన్ కల్యాణ్ ను ఎంచుకుంది. దక్షిణాదిన పవన్ చరిష్మాను ఉపయోగించుకోవాలని బీజేపీ బలంగా భావిస్తుంది. జనసేనలో ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ బీజేపీ కేంద్ర నాయకత్వం మాట జవదాటరు. వారిని కాదని పవన్ కల్యాణ్ ముందుకు అడుగు కూడా వేయరు. పవన్ కల్యాణ్ కు కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం అంతే ప్రాధాన్యత ఇస్తుంది. ఢిల్లీకి తరచూ వెళ్లకపోయినప్పటికీ మోదీ, అమిత్ షాలు ఆయనతో టచ్ లో ఉంటారు. పవన్ కల్యాణ్ కూడా సనాతన ధర్మం నినాదం ఎత్తుకోవడం వెనక బీజేపీ డైరెక్షన్ ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. హిందూధర్మాన్ని ఆయన భుజానకెత్తుకున్నారు.. ఇక మోదీ ఇక్కడకు వచ్చినా, పవన్ కల్యాణ్ మోదీ సభకు వెళ్లినా పవన్ కల్యాణ్ ను ప్రత్యేకంగా పలకరిస్తారు. ఆయనకు ప్రత్యేకించి గౌరవం ఇవ్వడం వెనక కూడా ఇదే అంటున్నారు. తాజాగా అమరావతి రాజధాని పనుల పునర్నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా జరిగిన సభలోనూ పవన్ కల్యాణ్ ను మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. అంతేకాదు పవన్ కల్యాణ్ పై ప్రత్యేకంగా ఆప్యాయతను ప్రదర్శించారు. చాక్లెట్ ఇచ్చారని కొందరు విమర్శలు చేస్తున్నప్పటికీ పవన్ కల్యాణ్ ను సోదరుడుగా సంభోదిస్తూ మోదీ చేసిన ప్రసంగంతోనే ఆయనకు ఇచ్చిన విలువ అర్థమవుతుంది. మోదీ పవన్ కల్యాణ్ ను యువనేతగా అభివర్ణిస్తూ జనసేన క్యాడర్ కు మంచి కిక్కు అందించారు. వచ్చే ఏడాది తమిళనాడు ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అక్కడ పళనిస్వామిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది. అయితే అక్కడ బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు పవన్ కల్యాణ్ ను ఉపయోగించుకోనుంది. పవన్ కల్యాణ్ కు కీలక బాధ్యతలను అప్పగించే యోచనలో కేంద్ర నాయకత్వం ఉంది. రానున్న తమిళనాడుతో పాటు భవిష్యత్ లో కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లోనూ పవన్ సేవలను ఉపయోగించుకోవాలని డిసైడ్ అయినట్లు సమాచారం. మొత్తం మీద బీజేపీ పవన్ కల్యాణ్ కు ఇస్తున్న ప్రయారిటీ చూసి కూటమిలోని కొందరు నేతలకు కన్ను కుడుతున్నా ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

## ఐపీఎల్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్.. ముంబై, పంజాబ్ మ్యాచ్ వేదిక మార్పు.. కారణమిదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గామ్ దాడికి ఏప్రిల్ 22న 26 మంది ప్రాణాలను కోల్పోయారు. ఈ దాడికి ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు మే 7న తెల్లవారుజామున "ఆపరేషన్ సిందూర్"ను ప్రారంభించాయి. ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ ఐపీఎల్ పై పడింది. ఇందులో భాగంగా మే 11న ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కు వేదిక మార్చాల్సి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం (మే 11) ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ధర్మశాల వేదికగా హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ మ్యాచ్ ను ముంబైలోని వాంఖడేకు మార్చడం జరిగింది.

పాకిస్థాన్ బోర్డర్ లో ఉన్న ధర్మశాల విమాశ్రమం మూసివేయడమే ఇందుకు కారణం. ఉద్రిక్తల పరిస్థుతుల మధ్య ఇక్కడ మ్యాచ్ జరపకూడదని బీసీసీఐ నిర్ణయించుకున్నట్టు సమాచారం. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న అనేక విమానాశ్రయాలలో ధర్మశాల ఒకటి. ఈ విమానాశ్రమాలను మే 10 ఉదయం 5:30 గంటల వరకు మూసివేస్తారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా బుధవారం(మే 7) తెల్లవారుజామున పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై ఇండియా దాడి చేసింది. జమ్మూ, శ్రీనగర్, లేహ్, చండీగఢ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్ విమానాశ్రయాలు సైతం మూసివేయబడ్డాయి. ధర్మశాల విమానాశ్రయంలో కార్యకలాపాలను నిలిపివేయడం వలన ప్రస్తుతం ముంబైలోనే ఉన్న ముంబై ఇండియన్స్ ధర్మశాలకు చేరే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్ ధర్మశాలలోనే ఉండడంతో గురువారం (మే 8) మ్యాచ్ యధావిధిగా జరుగుతుంది. స్థానిక విమానాశ్రయం మూసివేయడానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్ ధర్మశాలకు చేరుకున్నందున ఈ మ్యాచ్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. ప్లే ఆఫ్స్ కు ముందు ముంబై, పంజాబ్, ఢిల్లీ జట్లకు మిగిలిన మ్యాచ్ కీలకం కానున్నాయి.

## రికార్డ్ ధరకు అమ్ముడుపోయిన ఆయుష్ మాత్రే.. సూర్య కెప్టెన్సీలో చెన్నై చిచ్చర పిడుగు



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ యువ సంచలనం ఆయుష్ మాత్రే టీమిండియా టీ20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో ఆడనున్నాడు. అదేంటి మాత్రే చెన్నై జట్టులో ఉంటే సూర్య సారధ్యంలో ఎలా ఆడతాడనే అనుమానం రావొచ్చు. 17 ఏళ్ళ మాత్రే బుధవారం (మే 7) జరిగిన %‌%20 ముంబై లీగ్ 2025 వేలంలో భారీ ధరకు అమ్ముడుపోయాడు. ఈ టీనేజ్ బ్యాటింగ్ సంచలనాన్ని సూర్య కుమార్ యాదవ్ జట్టు రూ. 14.75 లక్షల భారీ ధరకు దక్కించుకుంది. మాత్రే ట్రయంఫ్ నైట్స్ ముంబై నార్త్ ఈస్ట్ తరఫున ఆడనున్నాడు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయపడడంతో అతని స్థానంలో ఎంపికైన మాత్రే.. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో అదరగొడుతున్నాడు. 17 ఏళ్ల ఈ ముంబైకర్ ఇప్పటివరకు నాలుగు మ్యాచ్ ల్లో 185.22 స్ట్రైక్ రేట్‌తో 163 ??పరుగులు చేశాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 15 బంతుల్లో 32 పరుగులు చేసి ఆకట్టుకున్న మాత్రే.. ఇటీవలే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్ లో 48 బంతుల్లో 94 పరుగులు చేశాడు. ఈ కుర్రాడి ఇన్నింగ్స్ లో తొమ్మిది బౌండరీలు, ఐదు సిక్సర్లు ఉండడం విశేషం. ఈ సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేస్ నుంచి నిష్క్రమించినా మాత్రే మాత్రం ఫ్యూచర్ ఆశాకిరణంలా మారాడు. భారత అండర్ 19 జట్టు తరపున.. ముంబై సీనియర్ జట్టు తరపున తన తొలి సీజన్‌లో సంచలనాత్మక ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత.. ఐపీఎల్ లో కూడా సత్తా చాటాడు. డొమెస్టిక్ క్రికెట్ లో నాగాలాండ్‌తో జరిగిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో మాత్రే ముంబై మాజీ ఓపెనర్ యశస్వి జైస్వాల్ రికార్డును బద్దలు కొట్టి లిస్ట్-ఎ క్రికెట్‌లో 150ం స్కోరు సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో ఈ 17 ఏళ్ళ కుర్రాడు 117 బంతుల్లో 181 పరుగులు చేసి మ్యాచ్ విన్నింగ్ సెంచరీ చేశాడు.

## మ్యాచ్ ఓటమికి కారణమైన పాండ్య.. రూ. 24 లక్షల జరిమానా విధించిన బీసీసీఐ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య రెండో సారి స్లో ఓవర్ రేట్ కు గురయ్యాడు. మంళవారం (మే 6) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా పాండ్యకు రూ.24 లక్షల రూపాయల ఫైన్ వేశారు. దీంతో ఐపీఎల్ 2025 సీజన్ లో రెండో సారి స్లో ఓవర్ రేట్ ఎదుర్కొన్న రెండో కెప్టెన్ గా నిలిచాడు. టాస్ ఓడి ముంబై మొదట బ్యాటింగ్ చేసింది. గుజరాత్ ఛేజింగ్ చేస్తున్నప్పుడు ఫీల్డింగ్ లో మార్పులు చేయడానికి హార్దిక్ ఎక్కువగా సమయం తీసుకున్నాడు. రెండో సారి స్లో ఓవర్ రేట్ కావడంతో ఈ సారి కెప్టెన్ తో పాటు ముంబై జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు కూడా ఫైన్ వేశారు. ఇంపాక్ట్ ప్లేయర్ తో సహా జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు టోర్నమెంట్ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25% ఏది తక్కువైతే అది జరిమానా విధించబడుతుంది. ఈ సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా శిక్ష అనుభవించిన కెప్టెన్ల లిస్ట్ లో పాండ్యతో పాటు శుభ్‌మాన్ గిల్ (గుజరాత్), అక్షర్ పటేల్ (ఢిల్లీ క్యాపిటల్స్), సంజు సామ్సన్ (రాజస్థాన్ రాయల్స్), రజత్ పాటిదార్ ( రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), రియాన్ పరాగ్ (రాజస్థాన్ రాయల్స్ ), రిషబ్ పంత్ (ముంబై ఇండియన్స్) ఉన్నారు.

ఈ సీజన్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్లకు జరిమానా విధించబడదు. అయితే కెప్టెన్లకు డీమెరిట్ పాయింట్లు ఇస్తారు. ఇవి మూడు సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ఈ నిషేధం తీవ్రమైన సందర్భాల్లో మాత్రమే జరుగుతుంది. ఈ మ్యాచ్ లో హార్దిక్ పాండ్య అన్ని విభాగాల్లో విఫలమయ్యాడు. మొదట బ్యాటింగ్ లో ఒక్క పరుగు మాత్రమే చేసిన పాండ్య.. ఆ తర్వాత బౌలింగ్ లో ఒకే ఓవర్ వేసి 18 పరుగులు ఇచ్చాడు. ఇక ఫీల్డింగ్ లోనూ చివర్లో రనౌట్ ఛాన్స్ ఉన్నా త్రో విసరడంలో విఫలమయ్యాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే వర్షం అంతరాయంతో ఆగుతూ.. సాగుతూ ఆఖరి బాల్ వరకూ ఆధిపత్యం చేతులు మారుతూ సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ మూడు వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్) ముంబైపై థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. మంగళవారం రాత్రి వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ముంబై 20 ఓవర్లలో 155/8స్కోరు చేసింది. అనంతరం వర్షం కారణంగా గుజరాత్ టార్గెట్‌ను డీఎల్ఎస్ ప్రకారం 19 ఓవర్లలో 147 రన్స్‌గా లెక్కగట్టారు. జీటీ ఏడు వికెట్లు కోల్పోయి ఆఖరి బాల్‌కు టార్గెట్‌ను అందుకుంది.

## ప్రశాంత్ వర్మ యూనివర్స్ లోకి
# మెగా హీరో!



మెగా వారసుడు వరుణ్ తేజ్ ప్రయోగాలు చేయడంలో ఏమాత్రం వెనుకడుగు వేయని హీరో. మెగా హీరోల్లో అతడు అందుకే స్పెషల్ అయ్యాడు. ఎంతో మంది హీరోలున్నా? ఎవరు చేయని ప్రయోగాలు చేసి తనకం టూ ప్రత్యేకమైన ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. ప్రయోగాలన్నీ సక్సెస్ కానప్పటికీ వరుణ్ ఇమేజ్ మాత్రం ఎక్కడా చెక్కు చెదరలేదు. ఇది అతడి ప్రతిభకు తార్కాణం. డిఫరెంట్ జానర్ చిత్రాలు ఫెయిల య్యాయని వరుణ్ వెనక్కి తగ్గడం లేదు. డిఫరెంట్ కాన్సెప్ట్ లు ఏవీ తన దగ్గరకు వచ్చినా? బాగుంది అంటే నో చెప్పకుండా లాక్ చేస్తున్నాడు. తాజాగా వరుణ్ తేజ్ , ప్రశాంత్ వర్మ యూనివర్స్ లోకి అడుగు పెడు తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ తనకంటూ ఓ యూనివర్స్ ని క్రియేట్ చేసుకుని సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. వేరు వేరు కథలతో సినిమాలు చేస్తూనే మరోవైపు తన యూనివర్స్ ని కూడా కంటున్యూ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసి పెట్టుకున్నాడు. ప్రస్తుతం - కాంతార- ఫేం రిషబ్ శెట్టితో - జై హనుమాన్- చిత్రం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇది - హనుమాన్- కి కంటున్యూ గా వస్తున్న చిత్రం. దీన్ని యూనివర్స్ లో కి తీసుకొచ్చి రకరకాల చిత్రాలు చేయడానికి సంక ల్పించాడు. ఇదే యూనివర్స్ లో భాగమవ్వాలని మెగాస్టార్ చిరంజీవి సైతం ఆశాభావం వ్యక్తం చేసారు. కానీ ప్రశాంత్ వర్మ ఆలోచనల్లో చిరంజీవి కనిపించలేదు. ఆయన లేకపోయినా వాళ్ల బ్బాయి వరుణ్ తేజ్ ఇప్పుడు ఇదే యూనివర్స్ లోకి ఎంటర్ అవ్వడం ఇంట్రెస్టింగ్. పీసీయూ నుంచి చాలా సినిమాలు చేసే అవకాశం ఉంది. అందులో ఓ చిత్రంలో వరుణ్ తేజ్ నటించే అవకాశాలున్నాయి. కానీ అదెప్పుడు జరుగుతుంది? అన్నది మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది పూర్తయిన తర్వాత పీసీయూ పై మరికొంత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



ఎక్కువ మాట్లాడే రజిషా విజయన్ సింపుల్ స్టైల్



ముత్యాల పొరలు మరియు హృదయ పూర్వక గ్రేస్‌లో శ్రద్ధా కపూర్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com